కేటీఆర్‌ను కలిసిన
ములుగు జిల్లా యువజన నేతలు....




3లో

సంతానలేమిపై అపోహలు వీడాలి!




3లో


PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 208 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 24 జులై 2026


# పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ఫాస్ట్-ట్రాక్ కోర్టు

ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన భారీ నిరసనల నేపథ్యంలో ప్రధాని మోదీ ఎట్టకేలకు స్పందించారు. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రధాన మంత్రి ఎక్స్ వేదికగా తెలిపారు. పేపర్ లీక్ ఘటనల్లో ప్రమేయం ఉన్నవారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా మిగతా 2లో.

# నేడు దేశవ్యాప్త ఆందోళనలు

- కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు
- శాంతియుతంగా నిరసనలు తెలపాలని సూచన



**న్యూఢిల్లీ,జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** నీట్ పేపర్ లీక్‌కు కేంద్రం బాధ్యత వహించాలంటూ ఉద్యమిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) 24న శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని మిగతా 2లో.

# కాంగ్రెస్, కమ్యూనిస్టుల జంతర్ మంతర్ రాజకీయాలు

- గతంలో లీక్ అయితే కాంగ్రెస్ నేతలు రాజీనామా చేశారా
- టెన్త్ లీకేజీలో రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదు
- కేంద్రమంత్రి మంత్రి కిషన్ రెడ్డి మండిపాటు




**న్యూఢిల్లీ,జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** జంతర్ మంతర్‌లో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలు పట్టుకుని కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల నేతలు రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్య మిగతా 2లో.

# గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ

- గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది బలి
- పేరు మార్చుకుని పరీక్షల కాంట్రాక్ట్ పొందింది
- గ్లోబరీనా తప్పిదాలకు కెటిఆర్ క్షమాపణలు చెప్పాలి
- ధర్మేంద్ర రాజీనామాను బిఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయదు
- దబిఆర్ఎస్, బిజెపిలు రెండూ ఒక్కటే
- సర్ ప్రక్రియలో ఎస్సీఎస్టీ, ఓట్లు తొలగించే కుట్ర
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు ఆరోపించారు. గురువారం మీడియాతో నిర్వహించి చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది చనిపోయారని.. ఆ సంస్థ పేరు మార్చుకొని పరీక్షల కాంట్రాక్టు పొందిందని వ్యాఖ్యానించారు. వీటి ఆధారంగానే మిగతా 2లో.



# పార్లమెంటులో ప్రతిష్టంభన

- నీట్ లీకేజీపై చర్చపై కుదరని ఏకాభిప్రాయం
- ధర్మేంద్ర రాజీనామా చేయాల్సిందేనని పట్టు
- విపక్షాల పట్టుతో పార్లమెంట్ నేటికి వాయిదా
- పార్లమెంట్ వెలుపల పరస్పర నినాదాలు

**న్యూఢిల్లీ,జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** పార్లమెంటులో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. గురువారం ప్రారంభమైన రెండు నిముషాలకే ఉభయసభలు తొలుత మిగతా 2లో.

# ఎల్‌నినోతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం

- అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష
- కార్యాచరణతో ముందుకు సాగాలని సూచన




**సిద్దిపేట,జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. దీనినుంచి బయటపడేలా కార్యాచరణతో సాగాలని అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఐఓసీ కార్యాలయంలో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మిగతా 2లో.

# విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్‌లు

- నాణ్యతలో రాజీపడకుండా సరఫరా
- క్యూర్ పరిధిలో మంచినీటి ప్రణాళికలు
- అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్‌జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** యూనిఫాంలు పంపిణీ చేసిన తర్వాత వాటి నాణ్యత, సైజు ఇతర అంశాలపై ప్రతి విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ (ఫీడ్ బ్యాక్) తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఇచ్చే ఫీడ్ బ్యాక్ ఆధారంగా వచ్చే ఏడాది పంపిణీ, వాటి రంగులు ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులకు యూనిఫాంల అందజేతపై మిగతా 2లో.




# గ్లోబరీనా సంస్థతో నాకు సంబంధం లేదు

- క్షమాపణలు చెప్పకుంటే లీగల్ చర్యలు
- రేవంత్ వ్యాఖ్యలపై కెటిఆర్ హెచ్చరిక

**హైదరాబాద్,జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడిందని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండి పడ్డారు. ముఖ్యమంత్రి హోదాకు తగిన విధంగా ఒక్కసారైనా వ్యవహరించాలని సూచించారు. పేపర్ లీక్ వంటి అత్యంత దురదృష్టకర ఘటనను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ తప్పుడు ప్రచారం చేయడం ముఖ్యమంత్రి పదవికే మచ్చ తెచ్చే చర్య అని ఆయన ఆరోపించారు. గ్లోబరీనా సంస్థతో బీఆర్ఎస్‌కు, తన కుటుంబానికి లేదా తనకు ఎలాంటి సంబంధం లేదని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. ఈ విషయంలో చేసిన ఆరోపణలపై క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో న్యాయపరమైన మిగతా 2లో.





# పోలీస్ వ్యవస్థ మరింత ఆధునికంగా మారాలి

- మారుతున్న కాలానుగుణంగా విధానాలు మార్చుకోవాలి
- ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు

**అమరావతి,జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు వ్యవస్థ మరింత ఆధునికంగా మారాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ పోలీస్ రిట్రీట్-2026 ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌కు హాజరైన సీఎం చంద్రబాబు, మారుతున్న నేరాలకు అనుగుణంగా పోలీసులు కూడా తమ విధానాలను మార్చుకోవాలని సూచించారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం నేరాల తీరు పూర్తిగా మారిపోయిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా కొందరు సమాజంలో అశాంతిని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. అలాంటి వాటిపై పోలీసులు అప్రమత్తంగా ఉండి వేగంగా స్పందించాలని మిగతా 2లో.

# మహానగరం నడిబొడ్డున పేదోడికి ఇల్లు ఉండొద్దా..?

- పేదలకు ఇళ్లు కడితే... ఎందుకంత కడుపుమంట?
- పదేళ్లు చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే... విష ప్రచారమా?
- కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో పేదలకు వాటా ఇస్తే తప్పా?
- రూ. 60 లక్షల విలువైన ఇంటిని ఆరు లక్షలకే ఇస్తుంటే బీఆర్ఎస్ కు కడుపుమంట
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలను దగా చేసింది బిఆర్ఎస్
- ఇండ్ల కేటాయింపులో బడుగు బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు
- బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్,జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ మహానగరం నడిబొడ్డులో పేదలకు గౌరవ ప్రదమైన సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలోనే వారి సొంతింటి కలను నెరవేర్చడానికి నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివసిస్తున్న ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని అన్నారు. ఈ ఇళ్ల కోసం స్థానికంగా మిగతా 2లో.

PCW తెలుగు దినపత్రిక
శుక్రవారం 24 జులై 2026

# కాంగ్రెస్, కమ్యూనిస్టుల జంతర్ మంతర్ రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)
బద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చాలని చూస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పేపర్లు లీక్ అయినప్పుడు కాంగ్రెస్‌లోని నేతలు ఏ రోజైన రాజీనామా చేశారా? అని ఆ పార్టీ నేతలను నిలదీశారు. యూపీఏ హయాంలో ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయనే విషయాన్ని గుర్తు ఉంచుకోవాలని ఆ పార్టీ నేతలకు కేంద్ర మంత్రి ఈ సందర్భంగా సూచించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌తోపాటు రాష్ట్రాల్లో జరుగుతున్న సంఘటనలు దురదృష్టకరమని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సంఘటనలు రాజకీయ ప్రేరేపితమైనవని అభివర్ణించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. గతంలో షాహీన్‌బాగ్‌లో ఆందోళనలు చేసిన నిరసనకారులు దీని వెనుక ఉన్నట్లు అనిపిస్తుందని అన్నారు. నీట్ పేపర్ లీక్ చేసిన వారిని అరెస్ట్ చేసి కేంద్ర ప్రభుత్వం జైలులో పెట్టిందని తెలిపారు. విద్యార్థులకు నష్టం జరగ వద్దని మరోసారి నీట్ పరీక్షను నిర్వహించామని వివరించారు.

పేపర్ లీక్‌పై 2024 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్రాన్ని ప్రశ్నించే హక్కు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఉందా? అని బల్లగుద్దీ ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకొని ప్రధాని ఇంటి ముందు ధర్నా చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఫాస్ట్ ట్రాక్ ద్వారా చట్టాన్ని మరింత కఠినం చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పదో తరగతి పేపర్ లీక్ అయిందని అన్నారు. మరి ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా ఎందుకు చేయలేదని ఆ పార్టీ నేతలను ఆయన నిలదీశారు. చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించే సత్తా మీకు ఎక్కడిదంటూ తెలంగాణలోని అధికార పార్టీ నేతల తీరును ఆయన ఎండగట్టారు. విద్యార్థులపై ప్రేమ లేదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు.

# గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ

(మొదటి పేజీ తరువాయి)
నీట్ కుంభకోణం జరిగిందన్నారు. గ్లోబరీనా తప్పిదాలపై కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ ముక్కు నేలకు రాయాలన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత కేటీఆర్, బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.కేటీఆర్ బర్త్ డే పై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ పుట్టిన రోజు దావత్ ఇస్తాడో అడగాలి. కేటీఆర్ ఇచ్చే దావత్ నేను తీసుకోలేనేమో. ఆయనవి అన్నీ వేరే పార్టీలు' అంటూ సెటైర్ విసిరారు. హరీశ్ గొప్పవాడైతే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. అతి తెలివి తేటలతో ఏదిపడితే అది మాట్లాడతానంటే నడవదని హరీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు కన్నెపెల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడుతున్నారని... మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ గురించి మాట్లాడితే ప్రజలు చెప్పుతో కొడతారని మండిపడ్డారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆర్ఎస్ వాళ్లే అని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ అయిపోయే వరకూ ఎమ్మెల్యేలను గ్రామాల్లోనే ఉండమని చెప్పానని ముఖ్యమంత్రి అన్నారు. సర్ నాయకులకు సంబంధించింది కాదని, ప్రజలకు సంబంధించిందని స్పష్టం చేశారు. 'తెలిసీ తెలియక నాకు రెండు ఓట్లు ఉన్నాయని అంటున్నారు. కలెక్టర్ అనుమతి తీసుకొని నా గ్రామంలో ఉన్న ఓటును కొడంగల్‌కు మార్చుకున్నాను. గతంలో కొడంగల్ ప్రాంతం కర్ణాటకలోని జిల్లాలో ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు చేసినప్పుడు కొడంగల్ పాలమూరులోకి వచ్చిందని చెప్పారు. బీజేపీ కుట్రపూరితంగా ఓట్లను తొలగించే అవకాశముందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతంలో అమాయకుల ఓట్లు పోయే అవకాశముందన్నారు. సర్ ఉద్దేశం ప్రక్షాళన అని.. కుట్ర పూరితంగా సర్‌ను వాడుతున్నారని ఆరోపించారు. సర్ పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే అని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు పోతే.. కాంగ్రెస్ ఓట్లు పోయినట్టే అని అన్నారు. అవగాహన లేకపోవడం, సరైన సమయంలో స్పందించకపోవడం వల్ల ఓట్లు పోయే అవకాశముందన్నారు. 'ఓటుహక్కు లేకపోతే పథకాలు పోతాయి.. ఓటుహక్కు లేకపోతే ఆధార్ పోతుంది. ఓటుహక్కు లేకపోతే గుర్తింపే ఉండదు... ఓటుహక్కు లేకపోతే సంక్షేమం రాదు' అని అన్నారు.బీజేపీలో అంతర్గత కలహాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులకు ఒకరంటే ఒకరికి పడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు ఎక్కడుంటాయో బీజేపీకి తెలుసని వెల్లడించారు. చిన్నచిన్న కారణాలతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు 5 లక్షలు ఇవ్వాలని డిసైడ్ అయిందని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు.. బ్రోకర్లకు అమ్ముకొని దళారీ వ్యవస్థ తెచ్చారని మండిపడ్డారు. 'మేం ఏం చేస్తున్నామో అదే చెప్తున్నాం' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఎస్ఐఆర్ పూర్తయిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రక్షాళన పేరుతో ఓట్లు తొలగించే అవకాశం ఉందని.. అలా జరగకుండా ఉండేందుకు బీఎల్‌వోలను పెట్టామన్నారు. ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయని సీఎం ప్రశ్నించారు.

# ఎల్‌నినోతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం

(మొదటి పేజీ తరువాయి)
ఈ సమావేశానికి హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్వేచ్ఛగా ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భవిష్యత్తులో తాగునీటికి సంబంధించి ప్రధాన సమస్య వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే జూన్ వరకు వర్షాలు లేవని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. పశువులకు పశుగ్రాసం ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించి కరవు పరిస్థితిలో ఆరుతడి పంటలు వేయాలని అన్నదాతలకు సూచిస్తున్నామని అన్నారు. గ్రౌండ్ వాటర్ రోజురోజుకూ పడిపోతోందని.. దీనిని పెంచేందుకు ప్రత్యేక యాక్షన్ ఎ÷-లాన్ ద్వారా ముందుకెళ్లాలని దిశానిర్దేశర చేశారు. వీబీజీ రాంజీ ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు తవ్వే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రతి వర్షం చుక్కను కాపాడుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ సమావేశంలో సిద్ధిపేట జిల్లా కలెక్టర్ హైమవతి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తాగునీటి సరఫరా, సాగునీటి నిర్వహణ, పశుగ్రాసం, చెరువుల్లో నీటి నిల్వలు, ఇతర అత్యవసర చర్యలపై సమీక్ష నిర్వహించారు. తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రౌండ్ వాటర్ పెంపునకు ఇంకుడు గుంతల తవ్వకం, రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్ ఫామ్ సాగు చేపట్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, అవసరమైన వనరులను సిద్ధంగా ఉంచాలని సమావేశంలో నిర్ణయించారు.

# మహానగరం నడిబొడ్డున పేదోడికి ఇల్లు ఉండొద్దా..?

(మొదటి పేజీ తరువాయి)
అందుబాటులో ఉన్న మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా మీసేవ వాట్సాప్ నెంబర్ (8096958096), వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.

సమీక్ష అనంతరం మంత్రి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో వారు చేయలేని పనిని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలతో రాజకీయ లబ్ధిపొందాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో పేదల సొంతింటి కలను నెరవేర్చలేక పోయింది. నగరంలోనే పుట్టి పెరిగి అక్కడే జీవిస్తున్న నిరుపేద కుటుంబాలకు నగర నడిబొడ్డులో సొంతింటిని సమకూర్చ వలసిన బాధ్యతను విస్మరించి, వారిని నగరానికి దూరంగా నెట్టివేసింది. ఉద్యోగా లు, ఉపాధి, పిల్లల చదువులు, వైద్య సౌకర్యాలకు దూరంగా 30?40 కిలోమీటర్ల దూరంలో కనీస వసతులు కల్పించకుండా అరకొరగా ఇళ్లను నిర్మించి అదే పేదల సంక్షేమమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

మార్కెట్ విలువ తొలి విడతలో ప్రారం భించనున్న 16 నియోజకవర్గాలలో రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందన్నారు.

క్యూర్ పరిధిలో తొలి విడతగా ప్రయోగాత్మకంగా నిర్మించే ఇందిరమ్మ ఇళ్లలో యాజమాన్య హక్కుల రిజర్వేషన్‌కు సంబంధించి ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5శాతం, బిసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం , ప్రభుత్వ అవుట్ సోర్సింగ్, 4వ తరగతి ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు 10 శాతం చొప్పున మొత్తం 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నాం.

ఈ 50 శాతం రిజర్వేషన్లలో కూడా 30 శాతం మహిళలకే కేటాయిస్తున్నాం. మిగిలిన 50 శాతం వాటా జనరల్ కేటగిరీలో కేటాయిస్తాం. పేద మధ్యతరగతి ప్రజల మీద బిఆర్ఎస్‌కు... ఆ పార్టీ లోని దొరలకు ఏ మాత్రం అభిమానం, ప్రేమ ఉంటే విష ప్రచారాన్ని మానుకుంటారని ఆశిస్తున్నాను. ఈ విష ప్రచారాన్ని ఇదేవిధంగా కొనసాగిస్తే జూబ్లీ హిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికలలో పట్టిన గతే రాష్ట్ర వ్యాప్తంగా పడుతుందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు.

# యువత గొంతు నొక్కితే పతనం తప్పదు

### - బిజెపికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక

**హైదరాబాద్,జూలై 23 (పిసిడబ్ల్యు న్యూస్):** యువత గొంతు నొక్కితే బీజేపీ రాజకీయ పతనం తప్పదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని భయపెట్టలేరని.. రాజ్యాంగాన్ని అణచలేరన్నారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా నిర్బంధాలు సరికాదని అన్నారు. ఉద్యోగాలు అడిగిన యువతకు లాఠీలు, కేసులే బీజేపీ సమాధానమన మంటూ విమర్శలు గుప్పించారు. ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కే అని చెప్పుకొచ్చారు. విద్యార్థుల స్వరాన్ని అణచివేయడం ప్రజాస్వామ్యానికి ముప్పని వ్యాఖ్యానించారు.యువత భవిష్యత్తుపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మంత్రి విమర్శించారు. విద్యార్థుల మధ్య నిలిచిన రాహుల్ గాంధీ నిజమైన ప్రజానాయకుడన్నారు. ప్రజల మధ్య ఉండే నాయకత్వానికే దేశం మద్దతిస్తుందని తెలిపారు. భయపెట్టి ప్రజల స్వరాన్ని శాశ్వతంగా అణచలేరని అన్నారు. విద్యార్థుల కలలను సంకెళ్లతో బంధించలేరని స్పష్టం చేశారు. యువత ఆశయాలను జైళ్ల గోడల మధ్య నిర్బంధించలేరన్నారు. రాజ్యాంగాన్ని ఎవరూ ఓడించలేరని.. రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ చారిత్రక బాధ్యత అని వెల్లడించారు. 'యువత విద్వేషం కాదు... విశ్వాసం కోరుకుంటోంది. అహంకారం కాదు... జవాబుదారీతనం కోరుకుంటోంది. ప్రచారం కాదు... పారదర్శక పాలననే యువత కోరుకుంటోంది' అంటూ వ్యాఖ్యానించారు.2029 ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షణకు కీలకమని ఉత్తమ్ వెల్లడించారు.

# గ్లోబరీనా సంస్థతో నాకు సంబంధం లేదు

(మొదటి పేజీ తరువాయి)
చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. దీనికి సంబంధించి తమ న్యాయ బృందం త్వరలోనే ముఖ్యమంత్రికి లీగల్ నోటీసు పంపనున్నట్లు వెల్లడించారు. అలాగే, ముఖ్యమంత్రి తరచూ తనపై అసభ్యకరమైన, ఆధారరహిత ఆరోపణలు చేస్తున్నప్పటికీ వాటికి తాను ఎక్కువగా స్పందించలేదని కేటీఆర్ పేర్కొన్నారు. తన మౌనం ఆరోపణలను అంగీకరించినట్లు కాదని, నిరాధార విమర్శల స్థాయికి దిగజారి వాదించడం తనకు ఇష్టం లేదని వ్యాఖ్యానించారు.

# పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ఫాస్ట్-ట్రాక్ కోర్టు

(మొదటి పేజీ తరువాయి)
చూసేందుకు ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ విషయంలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. అలాగే మన యువత భవిష్యత్తుకు హాని కలిగించే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు అని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే తమ తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. 'మన యువత సంక్షేమం, వారి భవిష్యత్తు కంటే.. ఏదీ ముఖ్యం కాదు!

పేపర్ లీకేజీల్లో ప్రమేయం ఉన్నవారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. దీనికి సంబంధించి అవసరమైన అన్ని చర్యలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాను. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు మేము తీసుకుంటున్న వరుస చర్యల్లో ఇది భాగం. యువత భవిష్యత్తును దెబ్బతీసేందుకు ప్రయత్నించే వారిని వదిలిపెట్టేది లేదు' అని ప్రధాని చెప్పారు.

# నేడు దేశవ్యాప్త ఆందోళనలు

(మొదటి పేజీ తరువాయి)
పిలుపునిచ్చింది. ఇటీవలి జంతర్‌మంతర్-పార్లమెంటు ర్యాలీ సందర్భంగా యువతపై పోలీసుల కర్కశత్వాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిరసనకు పిలుపునిచ్చినట్టు తెలిపింది. ఈ కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు, ఇతర ఏర్పాట్లకు సిద్ధం కావాలని యువతను కోరింది. శాంతియుతంగానే నిరసనలు ఉండాలని కూడా సూచించింది. పేపర్ లీక్ అంశంపై చర్చకు తాము సిద్ధమని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ మరో నిరసన కార్యక్రమానికి సిద్ధం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిరసన కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు పొందేందుకు, ఏర్పాట్లు చేసేందుకు విద్యార్థి సంఘాలు, యూత్ ఆర్గనైజేషన్లు కలిసి పనిచేయాలని సీజేపీ పిలుపునిచ్చింది. నీట్ పేపర్ లీక్ అంశంలో సీజేపీ డిమాండ్స్ గురించి ఈ నిరసనల్లో బహిరంగంగా చదవాలని పేర్కొంది. బాధితులకు సంఘీభావంగా ఇంక్విలాబ్ జిందాబాద్, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు చేయాలని కూడా సూచించింది. నిరసనల్లో కేవలం సానుకూల నినాదాలను మాత్రమే చేయాలని చెప్పింది. ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొంది. నిరసనకు అనుమతి ఉన్న ప్రాంతాలకే పరిమితం కావాలని, ట్రాఫిక్‌కు ఆటంకాలు లేకుండా చూసుకోవాలని సూచించింది. రెచ్చగొట్టే చర్యలకు స్పందించవద్దని కూడా పేర్కొంది. ఇక నీట్ ఉదంతంపై విచారణ కోసం కేంద్రం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఇదిలావుంటే సీజేపీ ఆందోళనల నేపథ్యంలో న్యూదిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎన్‌డీటీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆందోళనల తీవ్రత అధికంగా ఉన్న కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో గురువారం సాయంత్రం 6:30కే దుకాణాలు, కార్యాలయాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకు యజమానులు సహకరించాలని కోరింది. ఎన్‌డీటీఏ ఆదేశాలను ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సాయంత్రం 6:30 గంటలకే దుకాణాలు మూసేయమనడం, జంతర్‌మంతర్ వద్ద పోలీసులను మోహరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్రం మరోసారి బలప్రయోగం చేయాలని చూస్తోందని ఆరోపించారు.

# పార్లమెంటులో ప్రతిష్టంభన

(మొదటి పేజీ తరువాయి)
12గంటలకు వాయిదా పడ్డాయి. అనంతరం సమావేశమైనా సభలు సాగలేదు. ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేస్తేనే చర్చకు అంగీకరిస్తామని రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే తెగేసి చెప్పారు. నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేటికి వాయిదా పడింది. రాజ్యసభను కూడా మధ్యాహ్నం మూడు గంటల వరకూ వాయిదా పడింది. నీట్ పేపర్ లీక్ ఉదంతానికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం ప్రారంభించాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని పట్టుబట్టాయి. ఈ క్రమంలో సభ పలుమార్లు వాయిదా పడింది. పేపర్ లీక్ జరిగినట్టు ప్రభుత్వం అంగీకరిస్తే వెంటనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు.రూల్ 267 కింద చర్చ చేపట్టాలని కోరుతుంటే ప్రభుత్వం అంగీకరించట్లేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని కేంద్రం అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తరువాతే తాము ఏ చర్చకైనా సిద్ధమని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల తీరుపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. నీట్‌పై చర్చ నుంచి తప్పించుకోవాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని ఆరోపించారు. చర్చ ముందు షరతులు పెట్టడం భావ్యం కాదని అన్నారు. ఈ అంశంపై తన వాదన వినిపించే హక్కు ప్రభుత్వానికి కూడా ఉంటుందని అన్నారు. ఇదిలావుంటే పార్లమెంట్ వెలుపల విపక్షాలు, బిజెపిలు పరస్పర ఆందోళనలకు దిగారు. నిరసలనతో హోరెత్తించారు. కాంగ్రెస్ ఇండియా కూటమి ఒకవైపు, ఎన్‌డిఎ నేతలు మరో వైపు నిలబడి నినాదాలు చేశారు.

# విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్‌లు

(మొదటి పేజీ తరువాయి)
ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల లు, వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు అందజేసే యూనిఫాంల నాణ్యతలో రాజీపడబోమని సీఎం తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నాటికి పిల్లలందరికీ యూనిఫాం అందజేయాల్సినదేనని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించనని సీఎం హెచ్చరించారు. మహిళా సంఘాలు కుట్టు పని వేగవంతం చేసేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సెర్ప్ సీఈవో దివ్యకు సీఎం సూచించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు యూనిఫాంల అందజేతలో అడ్డగోలుగా వ్యవహరించారని సీఎం విమర్శించారు. తాము వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని, నాణ్యమైన యూనిఫాంలు అందిస్తామని తెలిపారు. పేద పిల్లల కోసం పని చేస్తున్నామని అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. వచ్చే సంవత్సరం జూన్ 2వ తేదీ నాటికే విద్యార్థులకు యూనిఫాం అందేలా కార్యాచరణ రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు బాల మాయా దేవి, షఫీ ఉల్లా, విజయేంద్ర బోయి, దివ్య పాల్గొన్నారు.

# పోలీస్ వ్యవస్థ మరింత ఆధునికంగా మారాలి

(మొదటి పేజీ తరువాయి)
సూచించారు. పోలీస్ వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించాలని, సాంకేతికతను మరింత సమర్థంగా వినియోగించాలని చంద్రబాబు సూచించారు. 'ఇన్విజిబుల్ పోలీస్.. విజిబుల్ పోలీసింగ్' విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేలా పోలీసింగ్ ఉండాలని చెప్పారు. నేరాలను అరికట్టడమే కాకుండా, నేరాలకు పాల్పడిన వారికి శిక్ష పడేలా చేయగలిగితే నేరాలు అదుపులోకి వస్తాయన్నారు. ప్రభుత్వంపై బురదజల్లేందుకు కొన్ని రాజకీయ పార్టీలు నేరాలకు కూడా వెనుకాడటం లేదని చంద్రబాబు అన్నారు.

పాస్టర్ ప్రవీణ్ ఘటనలో జరిగిన దుష్ప్రచారాన్ని పోలీసులు సమర్థంగా తిప్పికొట్టారని గుర్తుచేశారు. రాష్ట్రంలో గంజాయి నియంత్రణలో కొంత పురోగతి సాధించినప్పటికీ, ఇంకా పూర్తిస్థాయిలో కట్టడి చేయాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. గంజాయి మత్తులో జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రౌడీయిజం, ఫ్యాక్షనిజాన్ని సమర్థంగా నియంత్రించామని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు మరింత ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని చంద్రబాబు సూచించారు.

# కేటీఆర్‌ను కలిసిన ములుగు జిల్లా యువజన నేతలు....

### ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ మల్లంపల్లి మండల యువజన అధ్యక్షుడు మొర్రిరాజు యాదవ్...





**మల్లంపల్లి మండల ప్రతినిధి జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా యువజన విభాగం నాయకులు గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మల్లంపల్లి మండల యువజన అధ్యక్షుడు మొర్రిరాజు యాదవ్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ యువ నాయకులతో ఆత్మీయంగా ముచ్చటించారు. యువత ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుత్సాహానికి గురికావద్దని, ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలనపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేస్తూ, పార్టీ కార్యకర్తలకు ఎలాంటి సమస్య వచ్చినా కంటికి రెప్పలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం మొర్రిరాజు యాదవ్ మాట్లాడుతూ, యువతకు స్ఫూర్తిదాయక నాయకుడైన కేటీఆర్ నాయకత్వంలో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువజన విభాగం కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కోగిల మహేష్, యువజన నాయకులు అశోక్, చారి, సురేష్, చిరంజీవితో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆటో యూనియన్ నూతన కమిటీ సభ్యులు పోలీసు అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన వేళ

### ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### ఏటూరు నాగారం సీఐ సూర్యప్రకాష్



**ఏటూరునాగారం,జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏటూరునాగారం ఆటో యూనియన్ నూతన కమిటీ అధ్యక్షుడు ఇర్సవడ్ల కిరణ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు గురువారం ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సీఐ సూర్యప్రకాశ్, ఎస్ఐ మహేష్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు శాలువాలు కప్పి సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆటో యూనియన్ నూతన కమిటీ సభ్యులను పోలీసు అధికారులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా సీఐ సూర్యప్రకాశ్, ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ వాహనదారులందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణం కాకూడదని సూచించారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని చెల్లుబాటు అయ్యే పత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరు బాలరాజు, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఇర్సవడ్ల కిరణ్, నాయకులు ముదురుకోళ్ల సతీష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలి..: ఎండి తాజుద్దీన్, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ చైర్మన్

### కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. - మహమ్మద్ ఖలీముద్దీన్, 61వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు

### బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం పద్ధతి మార్చుకోకపోతే ప్రజలే తిరుగుబాటు చేస్తారు




**కరీంనగర్ జిల్లా జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ పిలుపు మేరకు డీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు ఈరోజు 61వ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ కలిముద్దీన్ ఆధ్వర్యంలో నగరంలోని కాశ్మీర్ గడ్డ 61వ డివిజన్ డివిజన్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చెయ్యడం జరిగింది,ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ చైర్మన్ మహమ్మద్ తాజోద్దీన్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజ్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలని పీఎం ఇంటీ ముందు నిరసన చేపట్టిన రాహుల్ గాంధీని అరెస్ట్ చెయ్యడం చాలా దారుణం అని ఒక ప్రతి పక్ష నేత అడిగిన ప్రశ్నకు మోడీ సమాధానం చెప్ప లేక రాహుల్ గాంధీని అరెస్ట్ చేపించడం చాలా దారుణం నెహ్రూ ప్రధాన మంత్రి ఉన్నపటి నుండి మన్మోహన్ సింగ్ వరకు ఏ కేంద్ర మంత్రి తప్పు చేస్తే వారిని మంత్రి వర్గం నుండి తీసివేయ్యడం శిక్షించడం జరుగేది కాని 2014 నుండి బీజేపీ మోడీ ప్రభుత్వం లో ఎంత పెద్ద తప్పు చేసినా ఏలాంటి చర్యలు తీసుకోకుండా నరేంద్ర మోడీ మౌనంగా ఉంటూ ఆ తప్పులను సమర్థిస్తున్నారని, న్యాయం కోసం ఢిల్లీలో నిరసన చేస్తున్న విద్యార్థిని విద్యార్థులను పోలీసులు అతి దారుణంగా కొట్టడం వారి పై టియర్ గ్యాస్ ప్రయోగించడం బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పాలనకు నిదర్శనమని ఈ దమన కాండ ఆపకపోతే వచ్చే రోజుల్లో మనదేశం మరో నేపాల్ శ్రీలంక బంగ్లాదేశ్ లో జరిగిన విధంగా ప్రభుత్వం పై తిరుగుబాటు మొదలవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేహాల్, అహ్మద్, సాజిద్ అలీ,లేయాక్, ఖాద్రీ, అబ్దుల్ కరీం, మతీన్, అజీం, ఆరిఫ్ ఖాన్, రాజ్ కుమార్, ఖాదర్, ఎండీ అన్వర్, అసిఫ్, సజ్జద్ సాజిద్, బదర్, అతర్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి: అదనపు కలెక్టర్ జి. నగేష్



**రాజన్న సిరిసిల్ల జూలై 23(పీసీడబ్ల్యూ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లాకు సంబంధించిన వక్ఫ్ ప్రొటెక్షన్ అండ్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. నగేష్ అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో నిర్వహించారు. జిల్లాలోని వక్ఫ్ ఆస్తులు, భూముల పరిరక్షణతో పాటు వాటికి సంబంధించిన సమస్యల పరిష్కారంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ జిల్లాలోని వక్ఫ్ ఆస్తులు, భూములు, వివాదాలు, ఇతర సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ వివాదాల విషయంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వక్ఫ్ కమిటీ మహిళా సభ్యురాలు నాయీమా నాసారి వేములవాడలోని వక్ఫ్ ఆస్తులు, జామా మసీదు పునర్నిర్మాణం, నూతన ఖబ్రస్తాన్ స్థలం కేటాయింపు అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. ఈ విషయాలపై మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జి. కుమారస్వామితో సమన్వయం చేసి త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు. వక్ఫ్ కమిటీ ఎన్జీవో సభ్యుడు, న్యాయవాది అన్సర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వక్ఫ్ వివాదాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ సంబంధిత అ ది, కా ం ు ల క ం అవసరమైన ఆదేశాలు జారీ చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, డీఆర్ఓ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు, మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జి. కుమారస్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ (సర్వే అండ్ ల్యాండ్), సబ్-రిజిస్ట్రార్, వక్ఫ్ కమిటీ సభ్యులు నాయీమా నాసారి, మొహమ్మద్ ఇస్మాయిల్, అన్సర్, జిల్లా వక్ఫ్ ఇన్‌స్పెక్టర్, మైనారిటీ సంక్షేమ శాఖ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నీట్ నిర్వహణలో కేంద్రం విఫలం!

### ● పరీక్షల బాధ్యత రాష్ట్రాలకు అప్పగించాలి ● సోషల్ జస్టిస్ ఫోరం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్ కుమార్ డిమాండ్



**వరంగల్ టౌన్, జూలై 23(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షను పారదర్శకంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమైందని సోషల్ జస్టిస్ ఫోరం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు అచ్చ వినోద్ కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. కేంద్ర విద్యాశాఖ వైఫల్యం, అవినీతి విధానాల వల్ల రాత్రింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడటం విచారకరమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తల్లిదండ్రుల కష్టం బూడిదలో పోసిన పన్నీరు: ఎంతోమంది పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు తమ పుస్తెలు అమ్మి, అప్పులు చేసి, కడుపు కట్టుకుని పిల్లలను కోచింగ్‌లకు పంపారని, పేపర్ లీకేజీల వల్ల వారి త్యాగాలు బూడిదలో పోసిన పన్నీరయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీల కారణంగా మనస్తాపానికి గురై విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కేంద్ర ప్రభుత్వం చలించడం లేదని, ఇందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు అధికారాలు ఇవ్వాలి, కేంద్రం తన చేతకానితనాన్ని ఒప్పుకొని, నీట్ నిర్వహణ బాధ్యతలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలని కోరారు. ఒకవేళ రాష్ట్రాలు కూడా సరిగా నిర్వహించకపోతే ప్రజలే ఆయా ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటం మానుకోవాలని, నీట్ నిర్వహణను రాష్ట్రాల పరిధిలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

# మల్లంపల్లిలో మోడల్ కాలనీ పారిశుధ్య పనుల పరిశీలన.....

### ● గ్రామ పరిశుభ్రతే లక్ష్యమన్న సర్పంచ్ శ్యామ్ రావు



**మల్లంపల్లి మండల ప్రతినిధి జూలై 23(పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామ పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ మల్లంపల్లి గ్రామంలోని మోడల్ కాలనీలో జరుగుతున్న పారిశుధ్య పనులను సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రైనేజీల పూడికతీత, వీధుల శుభ్రత, మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల శుభ్రపరిచే పనులను పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్యామ్ రావు మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా పారిశుధ్య పనులను ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామస్థులు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను నిర్ణీత ప్రదేశాల్లోనే వేయాలని, గ్రామ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ చారి, వార్డు సభ్యులు చెన్నబోయిన కవిత మహేందర్, గొల్లెన సారంగపాణి, కొంగరి నరేందర్, గూడెపు రాజిరెడ్డి, ఓన్నాల శంకర్, పారిశుధ్య సిబ్బంది, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు

# సంతానలేమిపై అపోహలు వీడాలి!

### ● దేశవ్యాప్తంగా 'ఓయాసిస్ ఫెర్టిలిటీ ఐవీఎఫ్ డ్రైవ్స్' ప్రారంభం

### ● పురుషుల్లోనూ సమస్యలు ఉండొచ్చు..సకాలంలో చికిత్సతో సంతానం సాధ్యమే




**హనుమకొండ,జూలై 23(పిసిడబ్ల్యూ న్యూస్):** సంతానలేమిపై సమాజంలో నెలకొన్న అపోహలను తొలగించి,శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు ఓయాసిస్ ఫెర్టిలిటీ దేశవ్యాప్తంగా'ఓయాసిస్ ఫెర్టిలిటీ ఐవీఎఫ్ డ్రైవ్స్'కార్యక్రమాన్ని ప్రారంభించింది. భారతదేశంలో తొలిసారిగా చేపట్టిన ఈ ప్రచారం ద్వారా సంతానలేమికి సంబంధించిన సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేసి,సకాలంలో వైద్యులను సంప్రదించేలా ప్రోత్సహించనున్నట్లు సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా ఓయాసిస్ ఫెర్టిలిటీ మెడికల్ హెడ్ డాక్టర్ జి.దుర్గారావు,రీజినల్ మెడికల్ హెడ్ జలగం కావ్య రావు మాట్లాడుతూ..సంతానలేమి మహిళలకు మాత్రమే సంబంధించిన సమస్య కాదని,పురుషుల్లోనూ పలు కారణాల వల్ల ఈ సమస్య ఏర్పడుతుందని అన్నారు. వివాహమైన ఏడాది పాటు సహజంగా గర్భం దాల్చకపోతే ఆలస్యం చేయకుండా ఫెర్టిలిటీ నిపుణులను సంప్రదించాలని సూచించారు. మారుతున్న జీవనశైలి,ఒత్తిడి,ఆలస్య వివాహాలు,పర్యావరణ ప్రభావం,ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా సంతానలేమి కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. అయితే ఆధునిక వైద్య సాంకేతికతతో ఐవీఎఫ్,ఐయూఐ,ఐసీఎస్ఐ,పీజీటీ-ఏ వంటి చికిత్సల ద్వారా అనేక మంది దంపతులకు సంతానం కలిగే అవకాశాలు మెరుగుపడ్డాయని వివరించారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో అవగాహన సదస్సులు,నిపుణుల సలహాలు,ఉచిత సంప్రదింపులు నిర్వహించనున్నట్లు సంస్థ వెల్లడించింది. సంతానలేమిపై ఉన్న భయాలు,అపోహలను తొలగించి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొంది. 2009లో స్థాపితమైన ఓయాసిస్ ఫెర్టిలిటీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 29 కేంద్రాల ద్వారా సేవలు అందిస్తోంది. అధునాతన సాంకేతికత,అనుభవజ్ఞులైన వైద్య బృందంతో సంతానలేమి చికిత్సలో నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది.

## కరీంనగర్ TGNPDCL కార్యాలయం వద్ద ఘనంగా భారతీయ మజ్దూర్ సంఘ్ (BMS) 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


● ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించిన

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్ జిల్లా జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని TGNPDCL కార్యాలయం వద్ద భారతీయ మజ్దూర్ సంఘ్ 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు ముఖ్య అతిథిగా హాజరై భారతీయ మజ్దూర్ సంఘ్ పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా భారతీయ మజ్దూర్ సంఘ్ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. విద్యుత్ రంగంలో అహర్నిశలు శ్రమిస్తున్న TGNPDCL రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి దీమీ నిరంతరం పోరాటం చేస్తోందని కొనియాడారు. కార్మికుల సంక్షేమం, భద్రత, న్యాయమైన హక్కుల పరిరక్షణలో BMS చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు, కంపెనీ ప్రెసిడెంట్ గుగులోతు రాందాస్ నాయక్, జిల్లా అధ్యక్షులు జి. సురేందర్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. ఫకీర్ దాస్, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, BMS జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, దీమీ విద్యుత్ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీ నిరసనకారులపై ఢిల్లీ పోలీసుల చర్యలు ఖండనీయం: డా. వెంకటేశ్వర్లు



**కరీంనగర్, జూలై 23(పిసి డబ్ల్యూ న్యూస్):** నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులపై పోలీసులు వ్యవహరించిన తీరును కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ చైర్మన్ డా. వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో సివిల్స్ పరీక్షతో సమానమైన ప్రతిష్ఠ కలిగిన నీట్ ప్రవేశ పరీక్షలో పదేపదే పేపర్ లీకేజీలు జరగడం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని అన్నారు. ఒక విద్యార్థి నీట్‌లో విజయం సాధించడానికి వేల గంటల పాటు కష్టపడటంతో పాటు కుటుంబ సభ్యులు ఆర్థికంగా, మానసికంగా ఎన్నో త్యాగాలు చేస్తారని పేర్కొన్నారు. అలాంటి పరీక్షల్లో అక్రమాలు చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులు, తల్లిదండ్రులపై ఢిల్లీ పోలీసులు, యూనిఫాం లేని వ్యక్తులతో కలిసి బలప్రయోగానికి పాల్పడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు పలువురు మేధావులు, రాజకీయ నాయకులు కూడా ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని డా. వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటం క్షమించరాని చర్య అని పేర్కొన్నారు. అదే సమయంలో ప్రజా సమస్యల పరిష్కారంలో తెలంగాణ పోలీసులు సంయమనంతో, సామరస్యపూర్వకంగా వ్యవహరిస్తున్న తీరును ఆయన అభినందించారు. నిరసన తెలిపే ప్రజాస్వామ్య హక్కును గౌరవిస్తూనే శాంతిభద్రతలను కాపాడుతున్న తెలంగాణ పోలీసుల విధానాన్ని దేశవ్యాప్తంగా ఆదర్శంగా తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

## దేశాభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకం..

**- బి.ఎం.ఎస్.ఆర్.యు. రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్**



**కరీంనగర్ జిల్లా జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** కార్మిక శక్తియే నిజమైన జాతీయ శక్తి అని, కార్మికులంతా అంకితభావంతో, దేశభక్తితో విధులను నిర్వర్తించాలని లిలిభారతీయ వైద్య విక్రయ ప్రతినిధుల యూనియన్ (బి.ఎం.ఎస్.ఆర్.యు.) రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్ పిలువునిచ్చారు. బి.ఎం.ఎస్. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ నగర్ కూడలిలో బి.ఎం.ఎస్.ఆర్.యు. ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్ జెండా ఆవిష్కరించి, యూనియన్ సిద్ధాంతాలను కార్యకర్తలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో కార్మిక వర్గం పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ఏ రంగానికి చెందిన కార్మికులైనా దేశభక్తితో పనిచేస్తేనే ఆ అభివృద్ధి ఫలాలు సమాజానికి అందుతాయన్నారు. “దేశం బాగుంటే పరిశ్రమ బాగుంటుంది, పరిశ్రమ బాగుంటే కార్మికుడు బాగుంటాడు“ అనే చక్రంలా ఈ వ్యవస్థ సాగుతుందని, అప్పుడే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని వివరించారు. రాజకీయాలకు అతీతంగా, ప్రత్యేక సిద్ధాంతాలతో పనిచేస్తున్న భారతీయ కార్మిక సంఘం (బి.ఎం.ఎస్.) ప్రపంచంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా అవతరించిందని పేర్కొన్నారు. ఇటువంటి గొప్ప సంఘంలో కార్యకర్తలుగా కొనసాగడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఎం.ఎస్. జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, బి.ఎం.ఎస్.ఆర్.యు. జిల్లా నాయకులు ఆముదుర్తి రవి, క్యాతం శ్రీనివాస్, నల్ల నవీన్, గోవిందుల సతీష్, మాదాసు విక్రమ్, వెంకటరమణ, సుల్తాన్, నక్క అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



# నీట్ లీక్‌కు బాధ్యత వహించాలి - ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఖండిస్తూ కరీంనగర్ 35, 36, 55 డివిజన్లలో కాంగ్రెస్ నిరసన**

**విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండించిన కాంగ్రెస్ - మోడీ, అమిత్ షా క్షమాపణ చెప్పాలి**

**23 లక్షల విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే చూస్తూ ఊరుకోము**

**విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు: దొంతి గోపి, యం.డి. ఇర్షాద్ అలీ, మాదాసు శ్రీనివాస్**



**కరీంనగర్ జూలై 23(పిసిడబ్ల్యూ న్యూస్):** నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థి యువతపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడం పట్ల స్పందించిన లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ప్రతిపక్ష నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం శాంతియుత నిరసన కార్యక్రమం చేస్తే మోడీ అమిత్ షా రాహుల్ గాంధీ మరియు ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్టు చేయడానికి ఖండిస్తూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నీట్ పేపర్ లీకేజీ పై లోక్సభలో చర్చ జరగాలనే ప్రధాన డిమాండ్ తో ఏఐసిసి పిసిసి పిలుపుమేరకు కరీంనగర్ పట్టణంలోని 35 వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసు శ్రీనివాస్, 36వ డివిజన్ అధ్యక్షులు శ్రీమతి దొంతి శిరీష గోపి, 55వ డివిజన్ అధ్యక్షులు మహమ్మద్ ఇర్షద్ అలీ ఆధ్వర్యంలో మారుతి నగర్, కాపువాడ ప్రధాన చౌరస్తా వద్ద కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యార్థి నిరుద్యోగ యువత పట్ల అవలంబిస్తున్న విధానాలను ఎండగడుతూ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి కాంగ్రెస్ నాయకులు దొంతి గోపి మాట్లాడుతూ విద్యార్థులు తమను కన్న తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని తమ ఉజ్వల భవిష్యత్తు కోసం డాక్టర్లు ఇంజనీర్లు కావాలని నీట్ పరీక్ష రాస్తే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నిర్లక్ష్యం వల్ల నీట్ పేపర్ లీకేజీ కావడంతో ఎంతోమంది విద్యార్థులు రోడ్డున పడ్డారు.. దీనికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని జంతర్ మంతర్ వద్ద వేలాది మంది యువత నిరసన దీక్ష చేపడితే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశాలతో విద్యార్థి యువతపై పోలీసులు విద్యార్థులు అమానుషంగా లాఠీ చార్జి చేస్తూ, అమానుషంగా ప్రవర్తించిన తీరును ఖండిస్తూ, ప్రధాని మోడీ నివాసం ముందు బైఠాయించిన లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇతర ముఖ్య నేతలు పోలీసులు అరెస్టు చేయడాన్ని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా భావిస్తున్నాం.. వెంటనే విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మోడీ, అమిత్ షా విద్యార్థులకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని విద్యార్థులకు అండగా ఉంటూ పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు దిండిగాల మధు, దుగ్గ మహేందర్, ఎండి ఇమ్రాన్, కోల రమేష్, పూదరి రమేష్, శైలజ, స్వాతి, ఇమ్రాన్ గని, కిం ఫహద్, హర్షద్, ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఖండిస్తూ కరీంనగర్ 27వ డివిజన్ కాంగ్రెస్ నిరసన

**అంబేద్కర్ విగ్రహం వద్ద వినతి పత్రం సమర్పించిన 27వ డివిజన్ కాంగ్రెస్ నేతలు**

**NEET లీక్‌కు బాధ్యత వహించాలి - ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: కిమ్ ఫహద్**

**ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి!**

**రాజ్యాంగ రక్షణే మన ధ్యేయం!**

**ప్రశ్నించే గొంతు పై దాడులు చేస్తున్న ఈ ప్రభుత్వం బుద్ధి చెప్పు.. బాబాసాహెబ్ అంబేద్కర్‌కు వినతి పత్రం సమర్పించిన కాంగ్రెస్ నేతలు**



**కరీంనగర్ జిల్లా జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాహుల్ గాంధీ గారి అక్రమ అరెస్టును ఖండిస్తూ కరీంనగర్ 27వ డివిజన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మరియు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు, NEET పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, ఢిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్‌ను ఖండిస్తూ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరియు ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టును నిరసిస్తూ 27వ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కిమ్ ఫహద్ ఆధ్వర్యంలో ఈరోజు అంబేద్కర్ నగర్‌లోని బాబాసాహెబ్ అంబేద్కర్ వద్ద శాంతియుత నిరసన చేపట్టి పూలమాల వేసి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించినారు. ఈ సందర్భంగా ఫహద్ మాట్లాడుతూ, “భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఇచ్చిన మాట్లాడే, ప్రశ్నించే, నిరసన తెలిపే హక్కును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోంది. విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాడినందుకు రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి. బాబాసాహెబ్ మనకు ఇచ్చిన రాజ్యాంగ విలువలను కాపాడుకునేందుకు మా పోరాటం కొనసాగుతుంది“ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి తాజుద్దీన్ నాయకులు లయిక్, ఎండి ఇమ్రాన్, పరశు రాం గౌడ్, ఇమ్రాన్ ఘని, ఆశీష్ రెడ్డి, పూదరి రమేష్ తో పాటు డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# బుల్లెట్ ట్రైన్‌లో జహీరాబాద్‌కు స్టాప్ ఇవ్వాలి:ఎంపీ వద్దిరాజు

● **రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన బిఆర్ఎస్ ప్రతినిధులు**







**న్యూఢిల్లీ, ప్రతినిధి జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతిపాదిత హైదరాబాద్‌ముంబై హై-స్పీడ్ రైలు (బుల్లెట్ ట్రైన్) కారిడార్‌లో జహీరాబాద్ రైల్వే స్టేషన్‌ను డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)లో చేర్చడంతో పాటు అక్కడ బుల్లెట్ ట్రైన్‌కు స్టాప్ మంజూరు చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. గురువారం పార్లమెంట్‌లోని మంత్రి ఛాంబర్‌లో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కే. మాణిక్‌రావు, మెదక్ డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ఎం. శివకుమార్‌తో కలిసి ఆయన మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. జహీరాబాద్ దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక కేంద్రంగా ఎదుగుతోందని, అక్కడ 12,656 ఎకరాల్లో నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (నిమ్జ్), ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ, డ్రై పోర్ట్, హైదరాబాద్‌నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్ వంటి కీలక ప్రాజెక్టులు అమలవుతు న్నాయని ప్రతినిధి బృందం మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. ఈ ప్రాంతంలో ఇప్పటికే వేల ఎకరాల భూసేకరణ పూర్తై, భారీ పెట్టుబడులు వస్తున్నాయని వివరించింది. హై-స్పీడ్ రైలు స్టాప్ మంజూరైతే తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరుతుందని, పారిశ్రామిక అభివృద్ధి, లాజిస్టిక్స్, ఎగుమతులు, పెట్టుబడులు మరింత వేగం పుంజుకుంటాయని పేర్కొన్నారు. మూడు లక్షలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు సృష్టించే ఈ ప్రాంతానికి ప్రపంచ స్థాయి రవాణా సదుపాయం అవసరమని వివరించారు. మహీంద్రా, అల్లానా, పిరమల్, రాక్‌వూల్, ఎంజీ ఆటోమోటివ్ వంటి ప్రముఖ సంస్థలతో పాటు పలు ఇంజినీరింగ్, ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు జహీరాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, నిమ్జ్‌లో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా తదితర సంస్థల పెట్టుబడులు కూడా కొనసాగుతున్నాయని మంత్రికి వివరించారు. జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ స్టాప్ కల్పించడం ద్వారా హైదరాబాద్‌ముంబై పారిశ్రామిక అనుసంధానం బలోపేతం కావడంతో పాటు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుందని, ప్రాంతీయ సమతుల్య అభివృద్ధికి ఇది దోహదపడుతుందని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం అభిప్రాయపడింది. వేలాది మంది రైతులు పారిశ్రామికాభివృద్ధి కోసం తమ భూములను త్యాగం చేసిన నేపథ్యంలో, జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ స్టాప్ మంజూరు చేయడం వారికి తగిన గౌరవం చెల్లించినట్లవుతుందని పేర్కొంటూ, డీపీఆర్‌లో జహీరాబాద్ స్టేషన్‌ను చేర్చి స్టాప్ మంజూరు చేయాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను బీఆర్ఎస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రాజకీయ డ్రామాలు మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి...

## బిజెపి శంకరపట్నం మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్ ...

**మానకొండూరు జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** మానకొండూరు శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ తీరుపై బీజేపీ శంకరపట్నం మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి రాజకీయ ప్రదర్శనలు చేస్తున్నారని విమర్శించారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలను గాలికొదిలి రాజకీయ డ్రామాలు చేయడం తగదని అనిల్ హితవు పలికారు. ఈ సందర్భంగా మానకొండూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లిని పలు కీలక స్థానిక సమస్యలపై ఆయన నిలదీశారు.శంకరపట్నం మండల ప్రజలకు అత్యంత కీలకమైన ఆర్కండ్ల వాగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చి ఏమైంది? ప్రతి వర్షాకాలంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు మీకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో పారదర్శకత లోపించిందని, ప్రజల్లో వ్యక్తమవుతున్న సందేహాలను పూర్తి పారదర్శకతతో నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉపయోగపడే అరుంధతి ఫంక్షన్ హాల్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీనిని మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. నల్లవెంకటపల్లి – కేశవపట్నం రహదారి పనులు అసంపూర్తిగా ఉండటంతో వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని, ప్రస్తుతం రైతులు వర్షాభావం, సాగునీటి సమస్యలతో ఆందోళన చెందుతుంటే.,కాలువల ద్వారా నీటి సరఫరా, రైతులకు భరోసా కల్పించడం, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించడం మీ బాధ్యత కాదా? అని నిలదీశారు.**బహిరంగ చర్చకు సవాల్**"మీకు నిజంగా ప్రజలపై నమ్మకం ఉంటే... మానకొండూరు నియోజకవర్గ అభివృద్ధి, ఎన్నికల హామీల అమలు, శంకరపట్నం మండల సమస్యలపై



ఎప్పుడైనా బహిరంగ చర్చకు రండి. బీజేపీ సిద్ధంగా ఉంది, మీరు సిద్ధమేనా?" అని ఏనుగుల అనిల్ సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో శంకరపట్నం మండల ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలుపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# గడ్డం లక్ష్మీనారాయణ చిత్రపటానికి సీనియర్ జర్నలిస్టుల ఘన నివాళి




**వరంగల్,జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ వాయిస్ ఈవెనింగ్ డిజిటల్ పేపర్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి సోదరుడు, దివంగత గడ్డం లక్ష్మీనారాయణ దశదినకర్మ వేడుకల్లో పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రభ ప్రతినిధి మెండు రవీందర్, అక్షర దర్బార్ ఎడిటర్ వేముల రాజేశ్వర్ రావు, ఢీంబాయ్ టీవీ న్యూస్ ఛానల్ సీఈవో వేముల సదానందం నేత, మన తెలంగాణ ప్రతినిధి వల్లాల వెంకటరమణ, విశ్రాంత ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ తదితరులు పాల్గొని గడ్డం లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లక్ష్మీనారాయణ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు, మిత్రులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.



**తొర్రూరు ప్రతినిధి,జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** నెట్ పేపర్ లీక్ పై దేవరుప్పులలో కాంగ్రెస్ నిరసన. పాలకుర్తి నియోజకవర్గం లోని దేవరుప్పుల మండలంనెట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ దేవరుప్పుల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసంగిస్తూ నెట్ పేపర్ లీక్‌తో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇలాంటి ఘటనలు దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర అనుమానాలకు దారితీస్తున్నాయని పేర్కొన్నారు. పేపర్ లీక్‌కు బాధ్యులైన వారిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, విద్యార్థుల గొంతు నొక్కే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించదని స్పష్టం చేశారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను అణచివేయడం కాకుండా వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# పెన్షనర్ల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడాలి

- నెలరోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమమే
- రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేరి వెంకటరెడ్డి
- ఖమ్మంలో వందలాది పెన్షనర్ల భారీ నిరసన ప్రదర్శన
- పెన్షనర్ల హక్కుల సాధన కోసం ముందుండి పోరాడుతా
- సమగ్ర ప్రయోజనాలు కలిగిన హెల్త్ కార్డులు, పెండింగ్ డీఏ లు, పే రివిజన్ కమిషన్ నివేదిక అమలుకై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తా..
- ఖమ్మం-నల్గొండ-వరంగల్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డిదశాబ్దాలుగా సేవలందించిన ఉద్యోగుల ఆవేదనను గుర్తించి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి









**ఖమ్మం ప్రతినిధి, జూలై 23 (పీసీడబ్ల్యూ న్యూస్) :** పెన్షనర్ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వీడాలని, నెలరోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఉన్న పెన్షనర్లు ఐక్యమత్యంతో పోరాటాన్ని ఉధృతంచేసి తమ హక్కులను సాధించుకుంటామని తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేరి వెంకటరెడ్డి అన్నారు. ఖమ్మం రోటరీనగర్‌లోని రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బయ్య అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఖమ్మం-నల్గొండ-వరంగల్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ... ఉద్యోగ, పెన్షనర్లకు రావాల్సిన ప్రయోజనాల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోందని, హెల్త్ కార్డుల అమలులో ఏర్పడిన లోపాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమగ్ర ప్రయోజనాలు కలిగిన హెల్త్ కార్డులు వారం రోజుల్లో విడుదలయ్యేలా కృషి చేస్తానని, పే రివిజన్ కమిషన్ నివేదిక అమలు, పెండింగ్ డీఏల విడుదల కోసం కూడా ప్రభుత్వంతో నిరంతరం చర్చలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. తాను కూడా పెన్షనర్‌నేనని, ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధనలో ముందుండి పోరాడతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకటరెడ్డి మాట్లాడుతూ... హెల్త్ కార్డు ట్రస్ట్ బోర్డులో తమ సంఘానికి ప్రాతినిధ్యం కల్పించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే 2024 మార్చి తర్వాత పదవీ విరమణ చేసిన అనేక మంది ఉద్యోగుల ప్రయోజనాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నెలరోజుల్లో సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన లక్షా యాభై వేల మంది పెన్షనర్లు ఐక్యంగా ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరు వేణు మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని శాఖల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారన్నారు. న్యాయస్థానం ఆదేశాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని వెల్‌నెస్ సెంటర్‌ను ఆధునికీకరించి పూర్తికాలం వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు. జీవితాంతం ప్రజాసేవ చేసిన ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందకపోవడం, ఆరోగ్య భద్రత కల్పించే హెల్త్ కార్డులు జారీ కాకపోవడం, పెండింగ్ డీఏలు విడుదల చేయకపోవడం, పే రివిజన్ కమిషన్ నివేదిక అమలులో జాప్యం కొనసాగడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ వందలాది మంది పెన్షనర్లు ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పెన్షనర్ల నుంచే నిధులు వసూలు చేసినప్పటికీ హెల్త్ కార్డుల మంజూరులో జరుగుతున్న జాప్యం వల్ల వృద్ధాప్యంలో వైద్య సేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను ఇకనైనా మానవీయ దృక్పథంతో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పే రివిజన్ కమిషన్ నివేదికను ప్రకటించి అమలు చేయాలని, పెన్షనర్ల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని వీడాలని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. "జీవితాన్ని ప్రభుత్వ సేవకే అంకితం చేసిన ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మానవీయ దృక్పథంతో స్పందించి, పెన్షనర్లకు రావాల్సిన ప్రతి హక్కును తక్షణమే అమలు చేయాలి. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమం అనివార్యమవుతుందనే హెచ్చరికను పెన్షనర్లు స్పష్టంగా వినిపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబాకుల వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు పి. సీతారామయ్య, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల నాయకులు, ఖమ్మం జిల్లా, నగర నాయకులు, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుతో యువకుడు మృతి

- ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి



**తొర్రూరు ప్రతినిధి,జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** తొర్రూరు మండలంలోని మడిపల్లి శివారు సోమవరపుకుంట తండాకు చెందిన బానోత్ ప్రవీణ్ (25) పాము కాటుకు గురై గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి భోజనం అనంతరం ఇంటి ముందు ఏర్పాటు చేసిన రేకుల షెడ్‌లో నిద్రిస్తున్న సమయంలో రాత్రి 11 గంటల ప్రాంతంలో కట్ల పాము అతని కాలి మడమ సమీపంలో కాటు వేసింది. వెంటనే లేచిన ప్రవీణ్ తనను కాటేసిన పామును చంపేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి వెళ్లి యాంటీ స్నేక్ వెనం చికిత్స తీసుకోవాలని సూచించినప్పటికీ ఏమీ కాదని నిర్లక్ష్యం చేసి ఇంట్లోనే పడుకున్నాడు. అనంతరం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో వాంతులు, విరోచనాలు ప్రారంభం కావడంతో కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రవీణ్ మృతి చెందాడు. మృతుడు చిన్న వయసులోనే తండ్రి బానోత్ లాల్ సింగ్‌ను కోల్పోయాడు. ప్రస్తుతం తల్లి బానోత్ రంగమ్మ, భార్య మమత, ఐదుగురు అక్కలను కుటుంబ సభ్యులుగా విడిచిపెట్టి వెళ్లాడు. ఈ ఘటనతో సోమవరపుకుంట తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ ఉద్యోగాల నియామకంలో అక్రమాలు

## - అర్హత లేని వారికి ఉద్యోగలిచ్చారు.... విచారణ జరిపి న్యాయం చేయాలి: దగ్గుబాటి సామ్రాజ్యం

**ఖమ్మం, ప్రతినిధి జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** చింతకాని మండలం వందనం గ్రామంలో జరిగిన ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ ఉద్యోగాల నియామక ప్రక్రియలో తనకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆ గ్రామానికి చెందినాఫ్ దగ్గుబాటి సామ్రాజ్యం ఆవేదన వ్యక్తం చేశారు. అర్హతలు ఉన్నప్పటికీ తనను పక్కనపెట్టి, అర్హత లేని, తక్కువ అర్హతలు కలిగిన ఇతర వ్యక్తులకు ఉద్యోగాలు కట్టబెట్టారని ఆమె ఆరోపించారు. ఖమ్మం లోని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సామ్రాజ్యం మాట్లాడుతూ ఉద్యోగాల ఎంపిక విషయంలో గ్రామ అధికార పార్టీ నాయకులు, సంబంధిత ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కై వ్యవహరించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూ పేరుతో అభ్యర్థులను రోజుల తరబడి కాలయాపన చేయించి, చివరకు నిబంధనలకు అనుగుణంగా ఇంటర్వ్యూ కూడా నిర్వహించలేదని ఆరోపించారు. కేవలం ఒక నిమిషం పాటు ఇంటర్వ్యూ నిర్వహించి, అభ్యర్థుల అర్హతలు, విద్యార్హతలు, అనుభవాన్ని సరిగా పరిశీలించకుండా ఉద్యోగాలకు ఎలా ఎంపిక చేశారని ఆమె ప్రశ్నించారు. ఇంటర్మీడియట్ కనీస అర్హతగా




ఉన్నప్పటికీ, దానికంటే ఎక్కువ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులను పక్కనపెట్టి, స్థానిక నాయకులకు నచ్చిన వారికి ఇష్టారాజ్యంగా ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. ఈ నియామకాల విషయంలో డబ్బులు చేతులు మారినట్లు తమకు అనుమానంగా ఉందన్నారు. ఉద్యోగాల నియామకానికి సంబంధించిన దరఖాస్తులు, అభ్యర్థుల అర్హతలు, ఇంటర్వ్యూ ప్రక్రియ, ఎంపిక జాబితా, అధికారుల పాత్రపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని ఆయన కోరారు. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని, అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై సంబంధిత ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి తగిన విచారణ జరపాలి. నాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయాలి. ఉద్యోగాల ఎంపిక ప్రక్రియను పారదర్శ కంగా మళ్లీ పరిశీలించాలి" అంటూ డిమాండ్ చేశారు.

# ఢిల్లీలో విద్యార్థులపై దౌర్జన్యాలకు నిరసనగా నేడు ఇందిరా పార్క్‌లో BRSV ఆందోళన

## - విద్యార్థుల పోరాటానికి సంఘీభావంగా కేటీఆర్ హాజరు.. భారీగా యువత పాల్గొనాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపు



**హైదరాబాద్, ప్రతినిధి జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ అంశంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న అణిచివేత ధోరణి, పోలీసు దౌర్జన్యాలకు నిరసనగా భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (BRSV) ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. విద్యార్థుల న్యాయమైన పోరాటానికి సంఘీభావం తెలుపుతూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్నారని ఆయన వెల్లడించారు. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల గొంతును అణిచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, వారి సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడడం అత్యంత విచారకరమని రవిచంద్ర విమర్శించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# వృద్ధురాలు అని చూడకుండా చితకబాదిన కొడుకు, కోడలు.?

● 6 నెలలుగా ఆర్టీసీ బస్టాండ్ తొర్రూర్ లో తలదాచుకుంటున్న వృద్ధురాలు ● పోలీసులకు తెలిపిన పట్టించుకోవడం లేదని ఆరోపణలు ● నన్ను అనాధాశ్రమానికి పంపండి

పి సి డబ్ల్యూ న్యూస్‌తో బాధలను వెళ్లబుచ్చిన వృద్ధురాలు.



**తొర్రూరు ప్రతినిధి,జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):**నవ మాసాలు కని పెంచి పెద్ద చేసిన తనయుడు తల్లిదండ్రులకు కాల యముడు లాగా చూస్తున్నారు కొందరు?.ఆస్తిని గుంజుకున్నారు వృద్ధురాలని చూడకుండా చితకబాది పంపించారు. వృద్ధాప్యంలో ఎటు వెళ్ళాలో తెలియని పరిస్థితులు తల దాచుకునేందుకు ఎక్కడ చోటు లేకపోవడంతో గత ఆరు నెలలుగా వృద్ధురాలు టీజి ఎస్ ఆర్టీసీ బస్టాండ్ తోరూరులో తన జీవితాన్ని వెల్లదీస్తున్నట్లు పీ సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్ట్ మనోహర్ స్వామి తో తన బాధలను వెళ్ళబుచ్చారు. ఈ విషయంపై ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న కొందరు వృద్ధురాలు బస్టాండ్ లోని అందరి వద్ద తోచినంత అడుక్కుంటూ రాత్రి వేళలో బస్టాండ్ లోని నిద్రిస్తున్నానని తెలిపారు. తనకు న్యాయం చేయాలని తోరూర్ పోలీస్ స్టేషన్ కి పలుమార్లు వెళ్లిన ఎవరు కూడా పట్టించుకోవడంలేదని పేర్కొంది. పూర్తి వివరాల్లోకి వెళితే రాయపర్తి మండలం బురాన్ పల్లి, నాను తండాకు చెందిన బూరమ్మ తనకు ఇద్దరు కుమారులని చిన్న కుమారుడు భార్య మాటలతో తన ఆస్తిని మొత్తం లాక్కొని అమ్ముకున్నారని తనకొచ్చే పింఛన్ కూడా వేలిముద్ర వేయగానే తన కోడలు చేతిలో నుండి లాక్కొని 200 చేతులు పెట్టి మిగతా డబ్బులను తీసుకువెళుతున్నారని ఎవరికీ చెప్పుకోలేని స్థితిలో ఉన్నానని అన్నారు. తన తమ్ముడు కిషన్ నాయక్ (మొండ్రాయి) తను ఒక గ్రామ సర్పంచ్ గా ఉన్నట్లు తెలిపారు. ప్రతినిత్యం బస్టాండ్ లో ఈ వృద్ధురాలును చూసే ప్రతి ఒక్కరు ఏదైనా అనాధాశ్రమానికి తరలించి ఆమెకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. ఆమె పరిస్థితి రోజురోజుకు క్షీణిస్తుందని సరైన నిద్ర ఆహారం లేక అనేక అవస్థలు బస్టాండ్ లోని పడుతుందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు లేదా ప్రజా ప్రతినిధులు స్పందించి ఆశ్రయం కల్పించాలని కోరుతున్నారు.

# ఎల్ నినో ప్రభావంపై పేరువంచ, ముగ్గు వెంకటాపురంలో గ్రామసభలు

- వర్షాభావాన్ని ఎదుర్కొనే కార్యాచరణపై అవగాహన: రైతులు, ప్రజలకు సూచనలు





**కల్లూరు, జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణపై పేరువంచ, ముగ్గు వెంకటాపురం గ్రామ పంచాయతీలలో ఆయా గ్రామ సర్పంచ్ ల అధ్యక్షతన గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలకు ముఖ్యఅతిథిగా ఎంపీడీవో చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులు, ప్రజలకు వ్యవసాయం, పశుపోషణ రంగాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని గ్రామసభలో నిర్ణయించారు. నీటి వినియోగంలో పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగు, పశువులకు మేత, తాగునీటి ఏర్పాట్లపై ప్రత్యేకంగా చర్చించారు.కార్యక్రమంలో పేరువంచ సర్పంచ్ కీసర నిర్మల మోహన్ రెడ్డి, ముగ్గు వెంకటాపురం గ్రామ సర్పంచ్ వడ్లమూడి బేబీ స్వరాజ్యలక్ష్మి, ఎంపీఓ సురేష్‌బాబు, వెటర్నరీ శాఖ అధికారులు, ఏఈ (ఐబీ), ఏఈఓ, ట్రాన్స్‌కో ఏఈ మహేంద్ర బాబు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# నడికూడలో మోడీ దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు



**నడికూడ, జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):**నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పర్నెం మల్లారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కాంగ్రెస్ నేతలతో మోడీ దిష్టి బొమ్మ దహనం చేశారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరియు ఇతర కాంగ్రెస్ నాయకుల అరెస్టులను ఖండిస్తూ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అదేశాల మేరకు మోడీ దిష్టి బొమ్మ దహనం చేసినట్టు తెలిపారు.ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ...నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో న్యాయం కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను నిరసిస్తూ గొంతెత్తిన రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి అని మండిపడ్డారు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం, ప్రజల గొంతుకను అణచివేయాలని ప్రయత్నించడం రాజ్యాంగ విలువలకు విరుద్ధం అని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్య ఉద్యమాలను ఎలాంటి నిర్బంధాలతోనూ అణచివేయలేరని, అన్యాయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలోలి జిల్లా ముఖ్య నాయకులు,సర్పంచులు, మండల సమన్వయ కమిటీ సభ్యులు,మండల కాంగ్రెస్ నాయకులు,గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,మహిళ కాంగ్రెస్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురు అరెస్ట్

రూ.11.55 లక్షల విలువైన 23.100 కేజీల గంజాయి స్వాధీనం




**కల్లూరు, జులై 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు పట్టణ శివారులో అక్రమంగా గంజాయి విక్రయాలు జరుపుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను కల్లూరు పోలీసులు చాకచక్యంగా పట్టుకుని, వారి వద్ద నుండి రూ. 11, 55,000/- విలువైన 23.100 కేజీల ఎండు గంజాయి, ఒక ఆటో రిక్షా, రెండు ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు, ఐదు వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు కల్లూరు ఏసీపీ వసుందరా యాదవ్ తెలిపారు. జూలై 22న పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు ఎస్సై హరిత తమ సిబ్బంది తో కలిసి కల్లూరు పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కల్లూరు శివారు కాశ్మీర శివాలయం ఖాళీ ప్రాంగణంలో ఆటో, బైక్‌లపై కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారని, పోలీసు వాహనాన్ని చూసి వారు పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీస్ సిబ్బంది వారిని వెంబడించి ఐదుగురిని పట్టుకున్నారని తెలిపారు. మరో ఇద్దరు వ్యక్తులు తమ ద్విచక్ర వాహనాలు వదిలేసి పారిపోయారన్నారు.పట్టుబడిన వారి ఆటోలో తనిఖీ చేయగా 12 ప్యాకెట్లలో ఎండు గంజాయి లభ్యమైందని,వెంటనే కల్లూరు తహశీల్దార్ వారి ద్వారా ఉూం నరసింహారావు, రామకృష్ణ లను పిలిపించి, చట్టబద్ధంగా పంచనామా నిర్వహించి గంజాయిని, వాహనాలను స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. అరెస్టయిన నిందితుల వివరాలు(ూా-1) మహమ్మద్ అన్వర్ (33) వృత్తి: ఆటో డ్రైవర్, నివాసం: మంచికంటినగర్, పాల్వంచ. (ూా-2) షేక్ ముజాహిద్ పాషా (30) ఆటో డ్రైవర్, నివాసం: పుల్లయ్యబంజర రోడ్డు, కల్లూరు. (ూా-3) మహమ్మద్ వజీర్ ఖాన్ (55) కార్ డ్రైవర్, నివాసం: మంచికంటినగర్, పాల్వంచ. (ూా-4) దేవరం రాకేష్ ఏ రాఖీ (28) ప్రైవేట్ ఉద్యోగం, =/శ్రీ యూసుఫ్‌గూడ, హైదరాబాద్. (ూా-5) మహమ్మద్ ఆదిల్ (24) వృత్తి: బట్టల వ్యాపారం, నివాసం: బోయిగూడా, సికింద్రాబాద్.(ఈ కేసులో పరారీలో ఉన్నవారు: ూా-6 రాజు, ూా-7 కార్తీక్ (ఒరిస్సా మల్కనగిరి) నేర నేపథ్యం మరియు విచారణ ముఖ్యాంశాలు:ూా-1 మహమ్మద్ అన్వర్ గతంలో ఒరిస్సాలోని మల్కనగిరి జిల్లా వీఎ-72 గ్రామానికి చెందిన రాజు, కార్తీక్ ల వద్ద కేజీ రూ. 3,000/- చొప్పున గంజాయి కొనుగోలు చేసి పాల్వంచ, కొత్తగూడెంలో విక్రయించేవాడు. గతంలో జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత, హైదరాబాద్‌కు చెందిన ూా-4 రాకేష్ కు కేజీ రూ. 12,000/- చొప్పున హోల్‌సేల్‌గా విక్రయించడం ప్రారంభించాడు. పోలీసు నిఘా పెరగడంతో తన బావ అయిన ూా-2 ముజాహిద్ పాషా, బాబాయి ూా-3 వజీర్ ఖాన్ లను ఈ వ్యాపారంలో భాగస్వాములుగా చేర్చుకున్నాడు. ఒరిస్సా నుండి ఆటోలో తెచ్చిన గంజాయిని కల్లూరులోని ముజాహిద్ పాషా ఇంట్లో నిల్వ చేసి, హైదరాబాద్ నుండి వచ్చిన రాకేష్ (ూా-4) మరియు అతని స్నేహితుడు ఆదిల్ (ూా-5) లకు విక్రయించేందుకు కల్లూరు శివాలయం వద్ద పంపిణీ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు:ఎండు గంజాయి: 23.100 కిలోగ్రాములు (12 ప్యాకెట్లు) మార్కెట్ విలువ రూ. 11, 55,000/- వాహనాలు: బజాజ్ డీజిల్ ఆటో (ూా-28-ు-9175) మరియు 2 ద్విచక్ర వాహనాలు (హోండా షైన్ & హోండా ూా-160). ఫోన్లు & నగదు: 5 స్మార్ట్‌ఫోన్లు/కీపాడ్ ఫోన్లు మరియు రూ. 5,000/- నగదు. తదుపరి పెద్దమొత్తంలో అక్రమ గంజాయి రవాణా, అమ్మకం, కలిగి ఉన్నటువంటి నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తు లింగం, ఎస్సై హరిత కల్లూరు, హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు, కానిస్టేబుల్లు అయిన రంగారావు, రఫీ, విజయకాంత్, డ్రైవరు ూా. ప్రసాద్ లను ఏసిపి అభినందించారు. తదుపరి గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, నిల్వ లేదా వినియోగం చేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని మరియు వారికి తగిన పారితోషికం అందించబడుతుందని తెలిపారు.

# భూ రీ-సర్వేను వందశాతం పారదర్శకంగా నిర్వహిస్తున్నాం: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

సంబంధిత రైతుల సమక్షంలోనే సరిహద్దుల నిర్ధారణ

భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం నమోదు

సత్తుపల్లి తహసీల్దారు కార్యాలయం లో బేతుపల్లి భూ రీ-సర్వే ప్రక్రియను ఎమ్మెల్యేకు వివరించిన జిల్లా కలెక్టర్

**సత్తుపల్లి, జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్):**రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూ రీ-సర్వే కార్యక్రమాన్ని ఖచ్చితంగా నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం సత్తుపల్లి తహసీల్దారు కార్యాలయంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తో కలిసి మండల సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా బేతుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ-సర్వే వివరాలను కంప్యూటర్ లో చేసే డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో భూ సర్వే ప్రక్రియ, సేకరించిన




సమాచారాన్ని డిజిటల్ రికార్డుల్లో నమోదు చేస్తున్న తీరును క్షుణ్ణంగా ఎమ్మెల్యే కు కలెక్టర్ వివరించారు. రోజుకు 10 బృందాలతో సూమరు 300 ఎకరాల భూ రీసర్వే చేస్తున్నామని, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, రీ-సర్వేలో ప్రతి దశను నిబంధనలకు లోబడి, పూర్తి ఆధారాలతో నమోదు చేస్తున్నామని, సర్వే సమయంలో సేకరించిన ప్రతి వివరాన్ని భూ యజమానులు, రైతుల సమక్షంలో ధ్రువీకరించి, పంచనామ చేసిన సమాచారం, భూ హద్దులు, సర్వే నంబర్లు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలు తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వేతో భూముల హద్దులు శాస్త్రీయంగా నిర్ధారించబడి, భూ రికార్డులు నవీకరించబడతాయని అన్నారు. రైతులకు స్పష్టమైన యాజమాన్య హక్కులు, పారదర్శక భూ రికార్డులు అందుబాటులోకి రావడంతో పాటు వంద శాతం భూ వివాదాల పరిష్కారానికి ఇది దోహదపడుతుందని అన్నారు. ప్రతి భూ రీ-సర్వే సమయంలో సంబంధిత రైతు వద్ద ఉన్న పట్టాదారు పాస్‌బుక్, పాత పహాణీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, సాగుకు సంబంధించిన ఇతర ఆధారాలు వంటి అన్ని పత్రాలు సర్వే నోటీసు అందించినట్లు రసీదు తీసుకోవడం, ఫోటోలతో కూడిన పంచనామా తయారు చేయడం, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ నమోదు చేయడం వంటి ప్రక్రియలను పూర్తి చేస్తున్నామని తెలిపారు.భూ సర్వే పూర్తయిన వెంటనే రైతు సమక్షంలోనే కొలతల వివరాలను వివరిస్తూ అవసరమైతే రైతు అభ్యర్థన మేరకు మరోసారి కొలతలు తీసి సందేహాలను నివృత్తి చేస్తున్నామని, రైతుకు వచ్చిన విస్తీర్ణాన్ని స్పష్టంగా తెలియజేసి, అతని అంగీకారంతో సంతకం తీసుకుంటున్నామని అన్నారు. ఇలా పారదర్శకంగా వ్యవహరిస్తున్నాం కాబట్టి రీ-సర్వేపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, సత్తుపల్లి తహసీల్దారు సత్యనారాయణ, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సోషల్ వెల్ఫేర్ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

- యుఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోట్ల సాగర్

- గురుకులాల జెడ్ఓ కార్యాలయంలో ప్రిన్సిపాల్ బోస్ కు వినతి

**ఖమ్మం ప్రతినిధి, జూలై 23 (పీసీడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించి విద్యార్థుల చదువుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బోట్ల సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలోని గురుకులాల జోనల్ ఆఫీసర్ కార్యాలయంలో తిరుమలాయపాలెం కళాశాల ప్రిన్సిపాల్ బోస్ కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోట్ల సాగర్ మాట్లాడుతూ.. బొమ్మ కాలేజీలో నడుపుతున్నటువంటి తిరుమలాయపాలెం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. సోషల్ వెల్ఫేర్ గురుకులాలకు సొంత భావనాలు లేక




విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. సరైన హాస్టల్ గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.మరుగుదొడ్లు, స్నానాల గదులు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు రెండు బాత్రూంలు మాత్రమే వర్కింగ్ లో ఉన్నాయన్నారు. ఇవి 680 మంది విద్యార్థులకు ఎలా సరిపోతాయని అన్నారు. బాత్రూమ్స్ కి సరైన డోర్లు లేవన్నారు. దీనివలన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు.బెంచీలు, డెస్కులు, ఫర్నిచర్ కొరత కూడా ఉందన్నారు. క్రీడా సామగ్రి, లైబ్రరీ, ఎక్కడ చదువుతే అక్కడే పడుకోవడం వంటి సమస్యలున్నా యన్నారు. సదుపాయాలు తగినంతగా లేవు.విద్యా ర్థులకు అవసరమైన వైద్య సేవలు, భద్రతా చర్యలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, పరిశుభ్రమైన వసతి, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని,




విద్యార్థులు మంచిగా చదువుకోవడానికి మెరుగైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపి మంచి విద్యను అందించేందుకు నూతన భవనాలు నేర్పించాలని కోరారు. జిల్లా నాయకులు జి. మేఘన, నిఖిల్, అఫ్రోజ్, మధు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గుండెచప్పుడు సింగరేణి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

### సింగరేణితో తెలంగాణ ప్రజలది భావోద్వేగ బంధం
### ప్రైవేటు పోటీని తట్టుకునేలా ఉత్పత్తి వ్యయం తగ్గించాలి
### సత్తుపల్లి ఓసి లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్షేత్రస్థాయి పరిశీలన







**సత్తుపల్లి, జూలై 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పోటీ ప్రపంచంలో సింగరేణి క్యాలరీస్ సంస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వ్యాపార విస్తరణ ద్వారా భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి తెలంగాణకు ఆత్మలాంటిది.. కార్మికులు, ప్రజలతో 130 ఏళ్ల చరిత్రకలిగిన సింగరేణితో భావోద్వేగ అనుబంధం ఉందని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ ప్రభుత్వ రంగ సంస్థను కాపాడుకోవడమే కాకుండా, రాబోయే తరాలకు లాభదాయకంగా అందించడం మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు. గురువారం సత్తుపల్లిలోని సింగరేణి ఒపెన్ కాస్ట్ బొగ్గుగనిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరిశీలించారు. గనిలో బొగ్గు లభ్యత, పరిమాణం, బొగ్గు క్వాలిటీని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుతో పాటుగా ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, జెన్ కో సీఎండీ హరీష్, సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పోట్రూ, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మీడియాతో మాట్లాడుతూ మైనింగ్ నిర్వహణలో పాటిస్తున్న పద్ధతులు, ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్తు ప్రణాళికలను ప్రత్యక్షంగా చూడటానికే క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. ఓవర్ బర్డెన్ అనేది మైనింగ్ లో బయటకు తీసే మట్టి, రాతి వ్యర్థం. బొగ్గు (జశ్ఘుశ్రీ) అనేది సింగరేణికి ప్రధాన రాబడి తెచ్చే అత్యంత విలువెఎన వనరుగా ఆయన అన్నారు. కాంట్రాక్టర్లకు ఓబి తీసినా, బొగ్గు తీసినా వాల్యూమ్ ప్రకారమే బిల్లులు వస్తాయి కాబట్టి వారి దృష్టిలో రెండూ ఒక్కటే అనిపించవచ్చని, సింగరేణి యాజమాన్యానికి మాత్రం ఓవర్ బర్డెన్, బొగ్గు మధ్య ఉన్న వ్యత్యాసం చాలా స్పష్టంగా తెలిసి ఉండాలన్నారు. ఫేస్ వద్ద బ్లాస్టింగ్ జరిపి, లోడింగ్ చేసే సమయంలో బొగ్గులో ఓవర్ బర్డెన్ మట్టి, రాళ్ళు కలవకుండా చూడాలన్నారు. ప్రతీ షావల్ దగ్గర, ప్రతీ లోడింగ్ పాయింట్ దగ్గర మన అధికారులు ఉండి కంటిన్యూయస్ మానిటరింగ్ చేయాలన్నారు. నాణ్యత లేని బొగ్గును రవాణా చేయడం వల్ల అనవసరమైన ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు పెరగడమే కాకుండా, థర్మల్ పవర్ ప్లాంట్లలో ప్రొడక్షన్ తగ్గిపోయి ట్రిప్ అవుతాయని అన్నారు. కల్తీ లేని నాణ్యమైన బొగ్గును మాత్రమే జెన్ కోకు ఇతర కస్టమర్లకు సరఫరా చేయాలని అధికారులకు సూచనలు చేశారు.ఒకప్పుడు బొగ్గు రంగంలో ఏకఛత్రాధిపత్యం ఉండేదని, ఈ రోజు పరిస్థితి మారిందని అన్నారు. మార్కెట్‌లో ప్రైవేటు సంస్థలు పోటీకి వస్తున్నాయని, విదేశాల నుంచి 'ఇంపోర్టెడ్ కోల్' వస్తోందన్నారు. ఈ కాంపిటీటివ్ మార్కెట్ లో సింగరేణి నిలబడాలంటే అత్యంత నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలన్నారు. అంతేకాక బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించడం ముఖ్యమని తెలిపారు. గత పదేళ్ల కాలంలో కొత్త కోల్ బ్లాక్స్ వేలంలో సింగరేణి పాల్గొనకపోవడం వల్ల చాలా అవకాశాలను కోల్పోయామని డిప్యూటీ సీఎం అన్నారు. ఒక కోల్ బ్లాక్ వేలంలో దక్కించుకుని, అక్కడ భూసేకరణ, అటవీ అనుమతులు సాధించి మైనింగ్ ప్రారంభించడానికి కనీసం 7 నుంచి 8 ఏళ్ల సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కనీసం 10 ఏళ్ల ముందస్తు ప్రణాళికతో పని చేయాలని అన్నారు. రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరుగుతుంది? దానికి ఎంత బొగ్గు అవసరం? అనేదానిపై సింగరేణి యాజమాన్యం - జెన్ కో యాజమాన్యం కలిసి కూర్చుని ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాడిచర్ల-2, నైని వంటి బ్లాక్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఫారెస్ట్ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించామని అన్నారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా జరిగే నూతన కోల్ బ్లాక్స్ వేలంలో సింగరేణి పాల్గొనేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు.ప్రపంచం మొత్తం ఈ రోజు గ్రీన్ ఎనర్జీ వైపు వెళ్తోంది. సింగరేణి కూడా కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా సోలార్ ఎనర్జీ రంగంలోకి వేగంగా అడుగులు వేయాలన్నారు. భవిష్యత్తులో థర్మల్ పవర్‌కు ప్రత్యామ్నాయంగా సోలార్, పంప్డ్ స్టోరేజ్, హైడ్రోజన్, న్యూక్లియర్ ఎనర్జీ వాడకం పెరుగుతుందని అన్నారు. దీనికి అనుగుణంగా సింగరేణి సోలార్ పవర్ ఉత్పత్తిపై మరింత దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు.మైనింగ్ రంగంలో సింగరేణి సంస్థకున్న అపారమైన అనుభవం, నిపుణులైన సాంకేతిక శక్తి కేవలం బొగ్గుకే పరిమితం కాకూడదన్నారు. సెమీకండక్టర్లు, చిప్ తయారీకి అవసరమైన క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ, మైనింగ్ ప్రక్రియలోకి సింగరేణి ప్రవేశించాలని ఆయన పిలుపునిచ్చారు.సింగరేణిని కాపాడుకుంటూ, లాభాల బాట పట్టిస్తూ, ప్రపంచ స్థాయిలో నిలబెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలైనా అందించడానికి సిద్ధంగా ఉందని డిప్యూటి సీఎం అన్నారు. అధికారులు, ఇంజనీర్లు, కార్మికులు సమన్వయంతో పనిచేసి సింగరేణి ప్రభను మరింతగా వెలిగించాలని డిప్యూటీ సీఎం అన్నారు.అనంతరం కిష్టారం లో నిర్మించిన క్వార్టర్ల ను డిప్యూటీ సీఎం ప్రారంభోత్సవం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, సింగరేణి డైరెక్టర్లు ఎల్. వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, యం. తిరుమల రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

---

# మానవత్వానికి ముద్రగా "ప్రమీల ఆసుపత్రి" ఉచిత వైద్యశిబిరం





### రూ.7 వేల విలువైన లివర్ ఫైబ్రో స్కాన్ ఉచితం...
### వందలాది మందికి నాణ్యమైన వైద్య సేవలు
### సేవే పరమో ధర్మం అనే స్ఫూర్తితో
### వైద్యుల మానవీయ కార్యక్రమం...
### ఇతర వైద్యులకు ఆదర్శంగా కిమ్స్, ప్రమీల హాస్పిటల్స్

**ఖమ్మం ప్రతినిధి, జూలై 23 (పీసీడబ్ల్యూ న్యూస్) :** ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటను ఆచరణలో చూపిస్తూ, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను ఉచితంగా అందించాలనే ఉన్నత సంకల్పంతో ఖమ్మం నగరంలోని "ప్రమీల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి"లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విశేష విజయాన్ని సాధించింది. హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో రోగులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్‌కు చెందిన లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ వైద్యులు డాక్టర్ రియాజ్ రోగులకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. సాధారణంగా రూ.7 వేల వరకు ఖర్చయ్యే అత్యాధునిక 'లివర్ ఫైబ్రో స్కాన్' పరీక్షను పూర్తిగా ఉచితంగా నిర్వహించడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఖరీదైన పరీక్షలు చేయించుకోలేని అనేక కుటుంబాలకు ఈ శిబిరం గొప్ప వరంగా మారింది.అనంతరం ప్రమీల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నెల నాలుగో గురువారం గ్యాస్ట్రో నిపుణులు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ ఉచిత ఫైబ్రో స్కాన్ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామని వెల్లడించారు.ప్రాణాలను కాపాడే వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా మానవసేవగా భావించి, ఎలాంటి ఆర్థిక ఆకాంక్ష లేకుండా సమాజం కోసం ఉచిత వైద్య సేవలు అందిస్తున్న వైద్యుల సేవా దృక్పథం నిజంగా అభినందనీయం. నిరుపేదల బాధను తమ బాధగా భావించి, వారికి భరోసా నింపే ఇటువంటి వైద్యులు సమాజానికి దివిటీలు. ప్రజల ఆరోగ్య హక్కును కాపాడుతూ, సేవే పరమావధిగా ముందుకు సాగుతున్న వైద్యులను సమాజం గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత.నేటి కాలంలో వైద్యం వ్యాపార ధోరణిలో సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్న వేళ, మానవత్వాన్ని ముందుంచి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న కిమ్స్ హాస్పిటల్, ప్రమీల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు నిజమైన సేవాభావానికి ప్రతీకగా నిలిచారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడమే కాకుండా, ఇతర వైద్య సంస్థలకు కూడా స్ఫూర్తినిస్తూ సమాజంలో సేవా సంస్కృతిని మరింత బలోపేతం చేస్తాయి. "వైద్యుడి చేతిలో ఔషధం మాత్రమే కాదు... ఒక కుటుంబానికి ఆశ, ఒక జీవితానికి భరోసా కూడా ఉంటుంది. అలాంటి సేవాభావాన్ని సమాజం ఎంతగానో గౌరవించాలి." ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కీర్తి ప్రవళిక, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రాము, డాక్టర్ మనోజ్, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు, ప్రమీల ఆసుపత్రి యాజమాన్యం పిట్టల శ్రీకాంత్ రాజా, సాయి అవినాష్, దండ రోహిత్, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రఘునాథపాలెం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

---

# షాద్‌నగర్ చౌరస్తా విస్తరణకు బీసీ సేన మద్దతు.. ఆర్డీఓ సరిత చర్యలు ప్రశంసనీయం




### ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చౌరస్తా విస్తరణే మార్గం.. ప్రభుత్వాన్ని కోరిన బీసీ సేన
### చౌరస్తా విస్తరణ కోసం పోరాడిన ఆర్.ఎన్. రాముకు బీసీ సేన అభినందనలు.. ప్రజా మద్దతుతో ముందుకు రోడ్డు విస్తరణ

**షాద్ నగర్, జూలై 23 (పీసీడబ్ల్యూ న్యూస్) :** షాద్‌నగర్ చౌరస్తా రోడ్డు విస్తరణకు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) సరిత చేపట్టిన చర్యలు అభినందనీయమని జాతీయ బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు వరప్రసాద్ అన్నారు. రోడ్డు విస్తరణ అంశంపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఏకాభిప్రాయం వ్యక్తం చేయడం ప్రజా ప్రయోజనాలకు నిదర్శనమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ, చౌరస్తా విస్తరణ అంశాన్ని ప్రజల దృష్టికి తీసుకువచ్చి సమావేశం విజయవంతం కావడానికి కృషి చేసిన ఆర్.ఎన్. రాముకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రధాన కూడలిని విస్తరించి ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. సమావేశాన్ని సమన్వయం చేసిన ఆర్డీఓ సరితకు కృతజ్ఞతలు తెలిపారు.రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జయశ్రీకాంత్ మాట్లాడుతూ, రోడ్డు విస్తరణ పనులను ముందుకు తీసుకెళ్తున్న ఆర్డీఓ సరిత, మున్సిపల్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి మైత్రి తల్లి హాజరుకావడం అందరినీ భావోద్వేగానికి గురిచేసిందని, ఆమె ఎదుర్కొన్న జీవిత పరిస్థితులు హృదయాన్ని కలిచివేశాయని అన్నారు.అలాగే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూ ప్రభుత్వ కళాశాల పునరుద్ధరణ వంటి ప్రజా ప్రయోజన కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. షాద్‌నగర్ చౌరస్తా వద్ద రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సరిత, మున్సిపల్ కమిషనర్ సునీత, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీసీ సేన నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, స్థానిక ప్రజలు పాల్గొని చౌరస్తా రోడ్డు విస్తరణకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. చివరగా, చౌరస్తా విస్తరణ కోసం పట్టువిడువకుండా ఉద్యమించిన ఆర్.ఎన్. రామును షాద్‌నగర్ ప్రజల తరపున ప్రత్యేకంగా అభినందించారు.




# బోల్డ్ సన్నివేశాల్లో నటించలేను: కాజల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మరోసారి తన వ్యక్తిగత అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. సినిమాల్లో బికినీ, బోల్డ్ సన్నివేశాలు, రొమాంటిక్ సీన్స్‌పై ఇటీవల జరుగుతున్న చర్చల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా పెళ్లి తర్వాత హీరోయిన్లు గ్లామర్ పాత్రలు చేయడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో కాజల్ స్పందించిన తీరు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న కాజల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కెరీర్ ప్రారంభం నుంచే తాను బికినీ లేదా అతిగా బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి ఆసక్తి చూపలేదని తెలిపారు. అలాంటి పాత్రలు చేయడం తనకు వ్యక్తిగతంగా అసౌకర్యంగా అనిపిస్తుందని, అందుకే ఎన్నో భారీ చిత్రాలను కూడా వదులుకున్నానని వెల్లడించారు. సినిమాల కోసం లేదా డబ్బు కోసం నా వ్యక్తిత్వాన్ని మార్చుకోలేను. నాకు కొన్ని విలువలు, సిద్ధాంతాలు ఉన్నాయి. వాటిని నేను ఎప్పుడూ రాజీ పడను. తెరపై బోల్డ్ సీన్స్ చేయాల్సిన అవసరం ఉందని నేను భావించను అని కాజల్ స్పష్టం చేశారు. తల్లి అయిన తర్వాత తన ఆలోచనల్లో మరింత మార్పు వచ్చిందని కూడా ఆమె తెలిపారు. తన కుమారుడు నీల్ కిచ్లూ పెద్దయ్యాక తన సినిమాలు చూసి గర్వపడాలని కోరుకుంటానని, తన నటించిన పాత్రల గురించి భవిష్యత్తులో తన బిడ్డకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో కథలు, పాత్రల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.



## విశ్వనాథం అండ్ సన్స్ నుంచి కొత్త లుక్ విడుదల

కోలీవుడ్ స్టార్ హీరో సూర్యకు తమిళంతో పాటు తెలుగులోనూ భారీ అభిమాన వర్గం ఉంది. ఇటీవల విడుదలైన 'వీరభద్రుడు' సినిమాతో మాస్ హిట్ అందుకున్న ఆయన, ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్య పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన కొత్త పోస్టర్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా బ్రౌన్ కలర్ సూట్‌లో సూర్య కనిపించిన స్టైలిష్ లుక్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. చాలా కాలం తర్వాత సూర్యను ఇలాంటి క్లాస్, వింటేజ్ స్టైల్‌లో చూడటం ఫ్యాన్స్‌కు ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ పోస్టర్లతో సినిమాపై మరింత హైప్ పెంచిన మేకర్స్ మరో సర్‌ప్రైజ్ కూడా ప్రకటించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన రావడంతో, ఈ కొత్త పాటపై కూడా అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలను కలగలిపిన కథతో తెరకెక్కుతున్నట్లు




తెలుస్తోంది. సూర్యను కొత్త కోణంలో చూపించే ఈ సినిమా ఆయన కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో సూర్య బర్త్‌డే పోస్టర్లు ట్రెండింగ్‌లో ఉండగా, సాయంత్రం విడుదల కానున్న రెండో సాంగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## టాక్సిస్ ..భిన్నమైన కథాంశంతో రూపొందించిన చిత్రం



కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాక్ స్టార్ యశ్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన టీజర్, ప్రోమో వీడియోలు, పాటల్లో కనిపించిన బోల్డ్ కంటెంట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత కె. వెంకట నారాయణ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాక్సిక్ సాధారణ కమర్షియల్ సినిమా కాదని, తాము ఇప్పటివరకు నిర్మించిన చిత్రాల కంటే పూర్తిగా భిన్నమైన కథాంశంతో రూపొందించామని ఆయన తెలిపారు. ప్రేక్షకులు థియేటర్లలో ఈ సినిమాను చూసిన తర్వాత తప్పకుండా కొత్త అనుభూతిని పొందుతారని, సినిమా ముగిసిన తర్వాత చిత్ర బృందాన్ని అభినందిస్తారనే పూర్తి నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, 'టాక్సిక్' ఒక కల్పిత కథ ఆధారంగా రూపొందిన సినిమా అని, ముఖ్యంగా పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక కథనమని ఆయన స్పష్టం చేశారు. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే ఇందులో భావోద్వేగాలు, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉంటాయని సంకేతాలు ఇచ్చారు. ఇటీవల విడుదలైన 'మనసాగదే' పాటకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. యశ్, తారా సుతారియా మధ్య సాగే ఈ రొమాంటిక్ ట్రాక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. ముఖ్యంగా పాటలోని విజువల్స్, సంగీతం, ఇద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ పాటపై హీరోయిన్ తారా సుతారియా కూడా స్పందించారు. పాటలోని కొన్ని సన్నివేశాలను ఎంతో అందంగా చిత్రీకరించారని, చిత్రబృందం విజువల్‌గా అద్భుతమైన అనుభూతిని అందించిందని ఆమె సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. దీంతో ఈ పాటకు మరింత క్రేజ్ ఏర్పడింది. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# రాజకీయ ఎంట్రీ ఆధారంగా జననాయగన్



తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' తెలుగులో 'జన నాయకుడు' పేరుతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ మూవీ సమస్యలను దాటుకుని ఎట్టకేలకు విడుదలైంది. దళపతి వెట్రి కొండాన్ (విజయ్) ఓ ఖైదీగా జైలు జీవితాన్ని గడుపుతుంటాడు. ఓ వ్యాపారవేత్తని అంతం చేయడానికి జైలుపై పడిన ముఠాని ఎదురించి నిజాయతీ కలిగిన జైలు అధికారి (గౌతమ్ మేనన్) దృష్టిని ఆకర్షిస్తాడు. ఆ అధికారి సాయంతో ఆగస్టు 15న క్షమాభిక్ష కింద బయటకొస్తాడు వెట్రి. అంతలోనే ఆ అధికారి ఓ ప్రమాదంలో మరణిస్తాడు. దాంతో అతని కుమార్తె విజ్జి (మమిత బైజు)ని పెంచే బాధ్యతని వెట్రి తన భుజాన వేసుకుంటాడు. చిన్నప్పుడు తల్లి దారుణ హత్యని ప్రత్యక్షంగా చూసిన విజ్జి ప్రతి చిన్న విషయానికీ భయంతో వణికిపోతుంటుంది. ఆమెను ధైర్యవంతురాలిగా మార్చి, సైన్యంలో చేర్పించాలని నిర్ణయించుకుంటాడు. అందుకోసం శిక్షణ కూడా ఇప్పిస్తుంటాడు. ఇంతలో జాన్ హిమ్లర్ (బాబీ దేవోల్) విజ్జిని లక్ష్యంగా చేసుకుని ఆమెని అంతం చేయాలని తన ముఠాని పంపుతాడు. ఇంతకీ విజ్జిని జాన్ హిమ్లర్ లక్ష్యంగా చేసుకోవడానికి కారణమేమిటి? హిమ్లర్ ఎవరు? అతన్ని వెట్రి కొండాన్ ఎలా ఎదిరించాడు? విజ్జిలోని భయాన్ని పోగొట్టి ఆమెని ధైర్యవంతురాలిగా మార్చాడా? లేదా? విద్వేషాల్ని రగిలించడానికి పతకం వేసిన జాన్ హిమ్లర్ అసలు లక్ష్యమేమిటి? ఆయనకీ రాజకీయ నాయకుడు రోజా రంగస్వామి (ప్రకాశ్‌రాజ్)కీ మధ్య సంబంధం ఏమిటన్నది కథ. తెలుగులో విజయంతమైన 'భగవంత్ కేసరి' స్ఫూర్తితో రూపొందిన చిత్రమిది. ఇది మక్కీకి మక్కీ రీమేక్ కానప్పటికీ... ఆ కథలోని ఆత్మ, పాత్రలు పక్కాగా కనిపిస్తాయి. దాంతో తెలుగు ప్రేక్షకులకు అడుగడుగునా 'భగవంత్ కేసరి' సినిమానే గుర్తొస్తుంది. విజయ్ రాజకీయ అజెండా, మితిమీరిన వాణిజ్యాంశాల మధ్య కథలోని అసలు ఆత్మ నలిగిపోయింది. తమిళనాడు ఎన్నికలకు ముందు రూపొందిన ఈ సినిమా విజయ్ రాజకీయ ఆలోచనల్ని, అజెండాని మాత్రం పక్కాగా తెరపై ఆవిష్కరించింది. ఆయనకు రాజకీయంగా లబ్ది చేకూర్చే విషయాలు సినిమాలో అడుగడుగునా కనిపిస్తాయి. ఓ సన్నివేశంలో తమ్ముడూ... అంటూ విజయ్ చేతికి చెర్నాకోల అందిస్తారు ఎంజీఆర్. శత్రువుల భరతం పట్టు అన్నట్టుగా! అవన్నీ విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ కార్యకర్తలకూ, ఆయన అభిమానులకూ నచ్చే విషయాలే. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ నేపథ్యంలో తెలుగులో రూపొందించిన సన్నివేశాలు సినిమాకి ప్రధానబలం. అయితే 'జన నాయకుడు'లో ఆ సన్నివేశాలు అంత ప్రభావం చూపించవు. విజ్జి పాత్రలో చోటు చేసుకునే మార్పు మాత్రం తెలుగుకు దీటుగానే తమిళంలో రూపొందింది. డ్యాన్సులతోనూ, పంచ్ డైలాగులతోనూ, మేనరిజమ్స్‌తోనూ విజయ్ అదరగొట్టారు. ముఖ్యంగా కచ్చేరీ పాటలో ఆయన వేసిన స్టెప్‌లు అభిమానులకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. విజ్జి పాత్రలో మమిత బైజు మంచి నటనని ప్రదర్శించారు. పతాక సన్నివేశాల్లో ఆమె చేసిన పోరాటాలు ఆకట్టుకుంటాయి. పూజా హెగ్డే పాత్ర పరిధి తక్కువే కానీ, ఆమె తెరపై హుందాగా కనిపించారు. బాబీ దేవోల్ పాత్రలో బలం ఉంది. ముఖ్యంగా ద్వితీయార్ధంలో ఆయన పాత్రలో చోటు చేసుకునే మార్పు మంచి డ్రామాని పండిస్తుంది. ప్రియమణి పాత్రలో మలుపు ఆకట్టుకుంటుంది. ప్రకాశ్‌రాజ్, నాజర్, గౌతమ్ మేనన్ పాత్రల పరిధికి తగ్గట్టుగా నటించారు.

## రణ్‌వీర్ ప్రళయ్‌లో దక్షిణాది బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్ ?

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న భారీ బ్జడెట్ చిత్రం 'ప్రళయ్'పై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజా వార్త ఇప్పుడు మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా దక్షిణాది నటి కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కళ్యాణి ప్రియదర్శన్ ఇప్పటికే తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. సహజమైన నటన, అందంతో యువతలో ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పరచుకున్న ఆమెకు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ అవకాశం దక్కబోతుందనే వార్త చర్చనీయాంశంగా మారింది. రణ్‌వీర్ సింగ్ వంటి స్టార్ హీరో సరసన నటించే అవకాశం రావడం ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ తన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్, విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నారు. అలాంటి హీరోతో కళ్యాణి జోడీ కట్టడం సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా దక్షిణాది ప్రేక్షకుల్లో కూడా ఈ కాంబినేషన్‌పై చర్చ మొదలైంది. 'ప్రళయ్' చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. యాక్షన్ సీక్వెన్సులతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చే కథగా రూపొందుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో సినిమాను రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికపై అధికారిక ప్రకటన రాకపోయినా, త్వరలోనే చిత్రబృందం పూర్తి తారాగణాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.





# 'చెన్నై లవ్ స్టోరీ'కి భారీ క్రేజ్.. హాట్ కేకుల్లా అమ్ముడైన ప్రీమియర్ టికెట్లు

యువతరం కథానాయకుడు కిరణ్ అబ్బవరం కొత్త చిత్రం 'చెన్నై లవ్ స్టోరీ' విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. రేపు జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ సినిమాకు ఒకరోజు ముందుగా ఏర్పాటు చేసిన పెయిడ్ ప్రీమియర్లకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు అన్ని ప్రధాన కేంద్రాల్లో టికెట్లు పూర్తిగా అమ్ముడై, షోలు హౌస్‌ఫుల్ అయ్యాయి. ప్రేక్షకుల నుంచి వస్తున్న భారీ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, పలు థియేటర్ల యాజమాన్యాలు అదనపు స్క్రీన్లను జోడిస్తున్నాయి. హైదరాబాద్‌లోని ప్రసాద్స్, ఏఎంబీ సినిమాస్, పీవీఆర్ వంటి ప్రముఖ మల్టీప్లెక్సులతో పాటు విజయవాడ, వైజాగ్, కాకినాడ, రాజమండ్రి వంటి నగరాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సోషల్ మీడియాలో చిత్ర బృందం ఈ విషయాన్ని ప్రకటిస్తూ, షోలు సోల్డ్ అవుట్ అయినట్లు వెల్లడించింది. గతంలో కొన్ని చిత్రాలకు ఫలించిన పెయిడ్ ప్రీమియర్ల వ్యూహం, 'చెన్నై లవ్ స్టోరీ' విషయంలోనూ భారీ విజయాన్ని అందుకుంది. ఈ అడ్వాన్స్ బుకింగ్స్ ట్రెండ్ చూస్తుంటే, రేపు విడుదల కానున్న ఈ చిత్రానికి ఘనమైన ఓపెనింగ్స్ ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తం మీద, విడుదలకు ముందే హౌస్‌ఫుల్ బోర్డులతో ఈ సినిమా ప్రేక్షకులలో భారీ అంచనాలను నెలకొల్పింది. ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం సరసన శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాకు రవి నంబూరి దర్శకత్వం వహించారు. మాస్ మూవీ మేకర్స్, అమృత ప్రొడక్షన్స్ బ్యానర్లపై ఎస్.కె.ఎన్, సాయి రాజేష్ నిర్మించగా, ధీరజ్ మొగిలినేని సహ నిర్మాతగా వ్యవహరించారు. కథ, స్క్రీన్‌ప్లే బాధ్యతలను దర్శకుడు రవి నంబూరితో కలిసి నిర్మాత సాయి రాజేష్ పంచుకోవడం విశేషం. 'బేబీ' లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత సాయి రాజేష్ అందిస్తున్న కథ కావడంతో 'చెన్నై లవ్ స్టోరీ'పై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెరిగింది. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడికానున్నాయి. కిరణ్ అబ్బవరం కెరీర్‌లో ఈ ప్రేమకథ ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.